**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 87, పేజీలు - 08

శనివారం, సెప్టెంబర్ 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## ఖైరతాబాద్ ఉప పోరు షురూ

### - గెలుపు ధీమాతో బరిలోకి పార్టీలు!

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గానికి ఉప ఎన్నిక దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దానం నాగేందర్‌ను తెలంగాణ శాసనసభ సభ్యుడిగా 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హులుగా ప్రకటిస్తున్నామని హైకోర్టు పేర్కొంది. తత్ఫలితంగా ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు పరిగణించాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించగా అక్కడ చుక్కెదురైంది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం ధర్మాసనం అందులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం కానుంది.

దీంతో ఆరు నెలల్లో అక్కడ ఉప ఎన్నిక నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంటుంది. అయితే ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యమైన క్రమంలో అక్కడ విజయం సాధించడమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే వ్యూహ రచన ప్రారంభించాయి. మరోవైపు ఆయా పార్టీ నుంచి పోటీకి ఆసక్తి కనబరుస్తున్న నేతలు కూడా టికెట్ల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ఉప ఎన్నికలో గెలుపుపై అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించిన రాజకీయ వేడి ఇప్పటినుంచే మొదలైంది.

#### గ్రేటర్‌లో బలాన్ని పెంచుకునే దిశగా కాంగ్రెస్..

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఎలాగైనా విజయం సాధించాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 64 స్థానాల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చినప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే ఆ తర్వాత సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణాలతో జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో అధికార పార్టీ గ్రేటర్‌లో తన బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఖైరతాబాద్ ఉప ఎన్నిక విషయానికి వస్తే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి నుంచి బీఆర్ఎస్ విజయం సాధించింది. అయితే అభ్యర్థిగా గెలుపొంది, ఇప్పుడు అనర్హత వేటు ఎదుర్కొంటున్న దానం నాగేందర్ మాత్రం ప్రస్తుతం కాంగ్రెస్‌తో ఉన్నారు. అంతేకాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన విజయా రెడ్డి కూడా ప్రస్తుతం పార్టీలోనే కొనసాగుతున్నారు. ఇదికాకుండా, సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు రోహిన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ అయిన గద్వాల విజయలక్ష్మిలు కూడా ఖైరతాబాద్ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. దీంతో కాంగ్రెస్ ఎవరిని బరిలో నిలుపుతుందనేది చర్చనీయాంశంగా మారింది.అయితే దానం నాగేందర్ ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని పలుమార్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్‌కు అవకాశం కల్పించిన కాంగ్రెస్ ఇప్పుడు ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కూడా ఆయన వైపే మొగ్గు చూపే అవకాశం ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

2లో..

## సుప్రీంకు చేరిన సీఈసీ వ్యవహారం

### - ఏకపక్ష నిర్ణయాలన్నీ రద్దు కోరుతూ పిల్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ ప్రాసిక్యూషన్ ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించాలని ఆయన కోరారు. పిటిషన్‌లోని ప్రధాన డిమాండ్ల ప్రకారం, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల అంగీకారం లేకుండా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి. ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం-6లో చేసిన మార్పులను రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. దాదాపు 30 రాష్ట్రాలు-కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుమారు 13 కోట్ల ఓట్లను

2లో..

## గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ మహాగణపతి

### - ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికిన భక్తులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం విజయవంతంగా పూర్తయింది. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా దర్శనమిచ్చిన స్వామి గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. హుస్సేన్‌సాగర్ వద్దకు చేరుకుని భక్తులు బైబై గణేశా అంటూ నినాదాలు చేస్తుంటే గంగమ్మ ఒడికి చేరాడు. శుక్రవారం ఉదయం ఖైరతాబాద్ గణేష్ శోభాయాత్ర ఆలస్యంగా ప్రారంభమైనా నిమజ్జనం మాత్రం కాస్త వేగంగా జరిగిందని చెప్పవచ్చు. ఉదయం 6 గంటలకు శోభాయాత్ర ప్రారంభ కావాల్సి ఉండగా, బాహుబలి క్రేన్ పైపులలో టెక్నికల్ ప్రాబ్లం కారణంగా దాదాపు మూడు గంటలు లేటయింది. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి బడా గణేశుడి శోభాయాత్ర కనులపండువగా ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్ నుంచి ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్ వరకు ఈ ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర సాగింది. ఈ ఏడాది కూడా బడా గణేషుడ్ని పర్యావరణ హితంగా మట్టితోనే రూపొందించారు. ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్న తర్వాత ఖైరతాబాద్

2లో..

## ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర

### - మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన

2లో..

## లక్ష కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్

### - సీమ రాత మార్చబోతున్న చంద్రబాబు బిగ్ ప్లాన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఎడారిగా, కరువు ప్రాంతంగా ముద్రపడిన రాయలసీమను దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక మెగా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. సీమ ముఖచిత్రాన్ని, ఈ ప్రాంత రైతు ఆర్థిక స్థితిగతులను సమూలంగా మార్చే లక్ష్యంతో ప్రతిపాదించిన రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు అక్టోబర్ 2న శంకుస్థాపన జరగనుంది. మదనపల్లెలో జరిగే ఈ వైభవ వేడుకలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు.

#### దాదాపుగా లక్ష కోట్ల పెట్టుబడులు

ఈ ప్రాజెక్టు వెనుక ఉన్న నిధుల సమీకరణ స్కేల్ చాలా పెద్దది . కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక 'పూర్వోదయ' పథకం కింద వివిధ రూపాల్లో సమకూరే రూ. 40,000 కోట్ల నిధులకు తోడు, మరో రూ. 60,000 కోట్ల మేర ప్రైవేటు పెట్టుబడులను భాగస్వామ్యం చేస్తూ ఏకంగా రూ. లక్ష కోట్ల భారీ నిధుల వ్యయ ప్రణాళికతో ఈ విజన్‌ను అమల్లోకి తెస్తున్నారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు పాటు పక్కనే ఉన్న పొరుగు జిల్లాలైన ప్రకాశం, నెల్లూరులను కూడా ఈ హబ్ పరిధిలోకి చేర్చడం దీని విస్తృతికి అద్దం పడుతోంది.

#### రైతులకు అండగా సమగ్ర ప్రణాళిక

ఒకప్పుడు కేవలం వర్షాధార పంటలు, కరువు సహాయకాలపై ఆధారపడిన రాయలసీమలో నీటి లభ్యత పరిమితం. ఈ సవాలును జయించేందుకు ప్రభుత్వ

2లో..

## బాలాపూర్ లడ్డూ @రూ.39 లక్షలు

- దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి
- ఈసారి వేలంలో 9 మంది, పోటీపోటీగా పెరిగిన బిడ్లు
- లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ గణేశుడి లడ్డూ ప్రసాదం వేలంలో మరో కొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది జరిగిన వేలం పాటలో రికార్డు స్థాయిలో రూ.39 లక్షలు పలికింది. వనస్థలిపురం సాహెబ్ నగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, అర్బన్ గ్రూప్

2లో..

## రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి
- మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే నిజమైన నివాళి అని పేర్కొన్న రేవంత్
- కేంద్ర ప్రభుత్వంపై ఓట్లు, పార్టీలు, నిధుల దొంగతనం అంటూ తీవ్ర విమర్శలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నీలంబూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణలో రైతులు, బడుగు బలహీన

2లో..

## ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలి

### - కేంద్రానికి జగన్ డిమాండ్

- ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలన్న జగన్
- ఈసీలో కమిషనర్ల అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచన
- ఏపీలో గతంలో తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆరోపణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు. ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను

2లో..

## ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ నోటీసులు

### సాహితీ ఇన్‌ఫ్రా కేసులో సమన్లు

- రూ. 2.1 కోట్ల నగదు లావాదేవీలపై ఈడీ నోటీసులు
- ఈ నెల 27న విచారణకు హాజరు కావాలన్న ఈడీ అధికారులు
- పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు

2లో..




## స్టాలిన్ సర్.. నోరు విప్పండి

- వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్
- డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు
- ఈ విషయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కుమ్మక్కయ్యాయని విమర్శ



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళ రాజకీయాల్లో గ్రానైట్ వ్యాపారి ఆర్.వీరమణికి సంబంధించిన మైనర్ బాలికల లైంగిక వేధింపుల కేసు తీవ్ర కలకలం రేపుతోంది. గతంలో డీఎంకే పాలనలో ఈ కేసుపై ఫిర్యాదు అందినప్పటికీ.. అధికారంలో ఉన్నవారు ఈ దారుణమైన నేరాన్ని, దాని వెనుక ఉన్న మిస్టరీని పూర్తిగా తొక్కి పెట్టారని తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ ఆరోపించారు. ఈ కేసు ప్రధానంగా జెమ్ గ్రానైట్స్ అధినేత

2లో..

# ఖైరతాబాద్ ఉప పోరు షురూ

మరి కాంగ్రెస్ అధిష్టానం ఏం చేస్తుందనేది చూడాల్సి ఉంది.

### సిట్టింగ్ పోసిషన్ కోసం బీఆర్ఎస్..

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో విజయం సాధించి సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అందుకే ఉప ఎన్నికలో బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలని భావిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో సత్తా చాటిన బీఆర్ఎస్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాలను కోల్పోయింది. అయితే ఈసారి ఖైరతాబాద్ ఉప ఎన్నికలో విజయం సాధించి గత పరాజయాల నుంచి కోలుకోవాలని భావిస్తోంది. తద్వారా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు పార్టీ శ్రేణుల్లో జోష్ నింపాలని భావిస్తోంది. బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్నవారిలో మన్నె గోవర్ధన్‌రెడ్డి, మన్నె కవితారెడ్డిలు ఉన్నారు. అయితే మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు తలసాని సాయికిరణ్ పేరు కూడా బీఆర్ఎస్ అభ్యర్థిగా బలంగా వినిపిస్తోంది. ఇందుకోసం తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రయత్నాలు చేస్తున్నారని ఒకవేళ తన కుమారుడికి పార్టీ టికెట్ ఇస్తే అన్ని తానై చూసుకుంటానని కూడా ఆయన బీఆర్ఎస్ అధిష్టానానికి తెలియజేశారనే ప్రచారం సాగుతుంది. అయితే ఇటీవల వరుస పరాజయాలను అధిగమించేందుకు ఖైరతాబాద్ ఉప ఎన్నికలో విజయం సాధించే అభ్యర్థినే బరిలో దింపాలనే ఆలోచనతో ఉంది.

### సత్తా చాటేందుకు సై అంటున్న బీజేపీ..

గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కేవలం గోషామహల్‌లో విజయం సాధించింది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి స్థానాలను కైవసం చేసుకుంది. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోనే ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఉంది. ఇక్కడ బీజేపీ ఒక్కసారి విజయం సాధించింది. 2014లో టీడీపీ పొత్తుతో బరిలో దిగగా ఖైరతాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 2018,2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి చింతల రామచంద్రారెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు ఖైరతాబాద్ ఉపఎన్నికలలో తనకు మరోమారు టికెట్ ఇవ్వాలని చింతల కోరే అవకాశం ఉంది. మరోవైపు ఎన్‌వీ సుభాష్, జూటూరి కీర్తిరెడ్డి వంటివారు కూడా బీజేపీ ఆశావహుల జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ సీటు ఖాళీ అవ్వడంతోనే అక్కడ ఉప ఎన్నికకు సంబంధించి రాజకీయ వేడి మొదలైంది. మరి ఏ పార్టీ ఎవరికి టికెట్ కేటాయించనుంది?, ఏ విధమైన వ్యూహాలతో ముందుకు సాగనున్నాయి! ఏ పార్టీ విజయం సాధిస్తుంది? అనేది చూడాల్సి ఉంది.

# సుప్రీంకు చేరిన సీఈసీ వ్యవహారం

తొలగించారన్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీశ్ గార్గ్, ఈసీ ఐటీ విభాగం అధిపతి సీమా ఖన్నా తదితరులపై ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 32 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. గత 10 నెలల్లో ఎన్నికల కమిషన్‌లోని ఇతర ఇద్దరు కమిషనర్లు దాదాపు 14 సందర్భాల్లో పలు కీలక నిర్ణయాలపై లిఖితపూర్వకంగా తమ అసమ్మతిని వ్యక్తం చేశారని వెలువడిన మీడియా కథనాలను పిటిషన్‌లో ఉటంకించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా భారీ సంఖ్యలో ఓటర్లను తొలగించారని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు గతంలోనే ఆరోపించాయి. అయితే, కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు సహజమేని, తుది నిర్ణయాలు మాత్రం ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ గతంలో వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిటిషన్ దాఖలు దశలో ఉండగా, సుప్రీంకోర్టు దీనిపై ఇకా విచారణ చేపట్టాల్సి ఉంది.

# లక్ష కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్

సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరిస్తూనే, తక్కువ నీటితో అత్యధిక ఆదాయాన్ని, లాభాలను అందించే ఉద్యాన పంటలు పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు వైపు రైతులను మళ్లించడమే ఈ హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశం. ఆధునిక మైక్రో ఇరిగేషన్, ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు మరియు గ్లోబల్ మార్కెట్ లింకేజీలను కల్పించడం ద్వారా సీమ రైతుల్లో సంపదను సృష్టించే దిశగా ప్రణాళిక రూపుదిద్దుకుంది.

### చంద్రబాబు కృషి ఫలితం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ పెద్దలతో నిరంతరం జరిపిన సమర్థవంతమైన సంప్రదింపుల ఫలితంగానే కేంద్రం నుంచి ఇంతటి భారీ నిధుల కేటాయింపులు సాధ్యమయ్యాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం వ్యవసాయ ఉత్పత్తికే పరిమితం కాకుండా, ఈ హార్టికల్చర్ హబ్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అపారమైన అవకాశాలు లభిస్తాయి. దీనివల్ల స్థానికంగా ఉండే వేలాది మంది గ్రామీణ యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించే వీలుంది. ఇదే వేదికగా రాయలసీమ రూపురేఖలను మార్చే మరో కీలక మైలురాయి పడనుంది. వ్యవసాయ రంగంలో అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు, ఏఐ ఆధారిత సాగు పద్ధతులు, పరిశోధనలను ప్రోత్సహించేందుకు పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చింది.

### రిలయన్స్ అగ్రి వర్సిటీ

రిలయన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు కూడా అక్టోబర్ 2న శంకుస్థాపన జరగనుంది. ఇది సీమలో అగ్రికల్చర్ రీసెర్చ్ మరియు అగ్రి-టెక్ రంగానికి గ్లోబల్ కేంద్రీకృత గుర్తింపును తేనుంది. ఈ లక్ష కోట్ల ప్రాజెక్టుపై పెద్ద ఎత్తున సానుకూల చర్చ సాగుతోంది. శంకుస్థాపన పూర్తయి, ప్రతిపాదిత లక్ష్యాలు క్షేత్రస్థాయిలో అమల్లోకి వస్తే దక్షిణాసియాలోనే ఆంధ్రప్రదేశ్ ఉద్యాన రంగ రాజధానిగా ఎదిగేందుకు ఈ ప్రాజెక్టు ఒక గ్రేట్ గేమ్ ఛేంజర్‌గా మారబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర

ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.

# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ మహాగణపతి

గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మహాగణపతికి చివరగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఖైరతాబాద్ శోభాయాత్రలో విషాదం..



ఖైరతాబాద్ బడా గణేశుడితో పాటు రకరకాల రూపాల్లో హుస్సేన్ సాగర్ తీరానికి చేరుకుంటున్న నిమజ్జనాలను వీక్షించేందుకు భక్తులు వేలాదిగా భక్తులు ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌కు తరలివచ్చారు. అవాంఛిత ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అయితే ఉదయం ఖైరతాబాద్ గణేష్ శోభాయాత్రకు ముందే అక్కడ విషాదం చోటుచేసుకుంది. డ్యాన్స్ చేస్తున్న యువకులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో, భయాందోళనకు గురైన 20 ఏళ్ల యువకుడు తప్పించుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రక్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఖైరతాబాద్ వద్ద మెట్రో పిల్లర్ నంబర్ 1167 సమీపంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ ఘోరం జరిగిందని మృతుడి స్నేహితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఆగ్రహించిన తోటి యువకులు, మృతుడి స్నేహితులు ఖైరతాబాద్ జంక్షన్ వద్ద రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. బాధ్యులైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే నిరసనకారులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి లాగిపడేసి ఆందోళనను విరమింపజేసేందుకు యత్నించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి మృతుడి వివరాలపై దర్యాప్తు చేపట్టారు.

# బాలాపూర్ లడ్డూ @రూ.39 లక్షలు

అధినేత సామ ప్రణీత్ రెడ్డి ఈ పవిత్ర లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. స్వామివారి లడ్డూను దక్కించుకోవడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గతేడాది (2025 వేలంలో) బాలాపూర్ లడ్డూ రూ.35 లక్షల ధర పలకగా, ఈసారి అంతకంటే రూ.4 లక్షలు అధికంగా పలికి సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఈ వేలం పాటలో పాల్గొనేందుకు భక్తులు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. గతంలో బాలాపూర్ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న 32 మంది విజేతలతో పాటు, ఈసారి కొత్తగా 8 మంది భక్తులు వేలంలో పాల్గొనడంతో వేలం పాట హోరాహోరీగా సాగింది. చివరికి సామ ప్రణీత్ రెడ్డి 39 లక్షల ధర పాడి బాలాపూర్ గణేషుడి లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. 1994లో తొలిసారి బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం నిర్వహించారు. అప్పుడు కేవలం రూ. 450కి కొలను మోహన్ రెడ్డి అనే భక్తుడు బాలాపూర్ లడ్డూ దక్కించుకున్నారు. ఈ 32 ఏళ్లలో డిమాండ్ చాలా పెరిగింది. ఈ క్రమంలో 2026లో నిర్వహించిన వేలంలో ఏకంగా రూ.39 లక్షలకు సామ ప్రణీత్ రెడ్డి భక్తుడు బాలాపూర్ లడ్డూ దక్కించుకున్నారు .

# రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

వర్గాలు, సామాన్య ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఎంపీ బెన్నీ బెహనాన్, కేరళ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పేట నారాయణన్ సభ్యులుగా ఉన్న జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు. రాహుల్ గాంధీ తదుపరి భారత ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే రాజకీయ పోరాటం "గాంధీ పరివార్", "సంఘ్ పరివార్" మధ్యే జరుగుతోందని ఆయన అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ దేశం సంఘ్ పరివార్ వైపు ఉంటుందా లేక గాంధీ పరివార్ వైపు ఉంటుందా అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# స్టాలిన్ సర్.. నోరు విప్పండి

ఆర్.వీరమణికి సంబంధించింది. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలపై వీరమణితో పాటు ఆయనకు సహకరించిన శాంతి, ఆమె భర్త మహేంద్ర సింహన్‌లను పోలీసులు ఆగస్టులో అరెస్ట్ చేశారు. 2025 అక్టోబరులో డీఎంకే ప్రభుత్వ హయాంలో ఓ చైల్డ్ రైట్స్ యాక్టివిస్ట్, మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన వీడియో ఫుటేజ్ ఉన్న పెన్ డ్రైవ్‌ను యాంటీ వైస్ స్క్వాడ్‌కు అందించడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. అక్టోబర్ 6న జరగనున్న ఉపఎన్నికల ప్రచారం సీఎం విజయ్ ప్రసంగిస్తూ డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "తమిళనాడు ప్రజలు దీని వెనుక ఉన్న డీల్ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. 'స్టాలిన్ సర్ నోరు విప్పండి'. మీతో చేతులు కలిపి అన్నాడీఎంకే కూడా ఈ విషయంలో నోరు విప్పడం లేదు. ఇలాంటి సున్నితమైన, దారుణమైన విషయంలో కూడా మీ రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందాలు, కుమ్మక్కు రాజకీయాలు ఉంటాయా?" అని సీఎం విజయ్ ప్రశ్నించారు. తనను లేదా తన తల్లిని రాజకీయ ప్రత్యర్థులు వ్యక్తిగతంగా విమర్శించినప్పుడు తాను సహించానని, కానీ తమిళనాడులోని నా అక్కాచెల్లెళ్లు, తల్లుల పట్ల అశ్లీలంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోనని విజయ్ స్పష్టం చేశారు. డీఎంకే, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అసభ్యకరమైన కామెంట్స్ చేస్తున్నారని, దానిని ఎంకే స్టాలిన్ కుటుంబం ఆస్వాదిస్తోందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం డీఎంకే ప్రభుత్వ హయాంలో వీరమణిపై ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ అతడిని అరెస్ట్ చేయకుండా సరైన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు. అయితే ఇటీవల ప్రత్యేక పోక్సో కోర్టు ఈ క్లోజర్ రిపోర్టును తిరస్కరించి, కేసును తిరగదోడి సమగ్ర విచారణకు ఆదేశించింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేయడమే కాకుండా బాధితురాలి ప్రకటనను మెజిస్ట్రేట్ ముందు నమోదు చేశారు. ఈ విచారణలో మరికొందరు బాధితులను కూడా గుర్తించి వారి వాంగ్మూలాలను కోర్టుకు సమర్పించారు.

# ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ నోటీసులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ సమన్లు జారీ చేసింది. ఈనెల 27వ తేదీన విచారణకు హాజరుకావాలని అరికెపూడి గాంధీని ఈడీ ఆదేశించింది. సాహితి ఇన్‌ఫ్రా నుంచి అరికెపూడి గాంధీకి సంబంధించిన బ్యాంకు ఖాతాల్లోకి సుమారు రూ.2.1 కోట్ల మేర నిధులు బదిలీ అయినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ట్రాన్సాక్షన్ల స్వభావం, వాటిని ఎందుకు పంపించారు, వాటికి చట్టబద్ధమైన వ్యాపార కారణాలు ఉన్నాయా అనే అంశాలపై ఈడీ అధికారులు.. అరికెపూడి గాంధీ నుంచి వివరాలు తెలుసుకోనున్నారు. సాహితి ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈడీ ఇప్పటికే పలు ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తోంది. ఈ క్రమంలోనే అరికెపూడి గాంధీకి సంబంధించిన ఖాతాల ద్వారా సుమారు రూ.2.1 కోట్ల మేర నిధులు వెళ్లినట్లు గుర్తించినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఈ మొత్తానికి సంబంధించిన లావాదేవీలు ఎప్పుడు జరిగాయి, ఎలాంటి ప్రయోజనం కోసం నిధులు బదిలీ అయ్యాయి, వాటికి సాహితి ఇన్‌ఫ్రా కార్యకలాపాలతో ఏమైనా సంబంధం ఉందా అనే అంశాలపై ఈనెల 27వ తేదీన జరిగే విచారణలో ఈడీ అధికారులు వివరాలు కోరే అవకాశం ఉంది. సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు, విల్లాలు అందిస్తామని చెప్పి ప్రీ లాంచ్ ఆఫర్ల ద్వారా కొనుగోలుదారుల నుంచి నిధులు సేకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో పలువురు కొనుగోలుదారులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదుల ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఆధారంగా చేసుకుని ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు చేపట్టింది. తొలుత ఈ ప్రాజెక్టులకు సంబంధించి సుమారు రూ.248 కోట్ల మేర మోసం జరిగినట్లు కేసుల్లో ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాతి దర్యాప్తులో మొత్తం వ్యవహారంలో సుమారు రూ.842 కోట్ల మేర నిధులు ఉన్నట్లు ఈడీ అంచనా వేసింది. సాహితి ఇన్‌ఫ్రా ప్రమోటర్లు సేకరించిన నిధుల్లో కొంత మొత్తాన్ని వ్యక్తిగత, కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. సంస్థ ఎండీ బి. లక్ష్మీనారాయణ, మాజీ డైరెక్టర్ సందు పూర్ణచంద్రరావులపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈడీ వివరాల ప్రకారం సుమారు రూ.126 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2018 నుంచి 2020 మధ్య కాలంలో సుమారు రూ.50 కోట్లను నగదు రూపంలో తీసుకున్నారనే ఆరోపణలను కూడా దర్యాప్తు సంస్థ పరిశీలించింది. ఈ ఆరోపణలకు సంబంధించిన తుది న్యాయపరమైన నిర్ణయం ఇంకా రావాల్సి ఉంది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఇప్పటికే భారీగా ఆస్తులపై చర్యలు చేపట్టింది. తొలిదశలో సుమారు రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం మరో విడతలో రూ.12.6 కోట్ల విలువైన ఆస్తులను కూడా అటాచ్ చేసినట్లు తెలిపారు. అలాగే కేసుకు సంబంధం ఉన్నట్లు గుర్తించిన 56 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసినట్లు ఈడీ తెలిపింది. నిధుల మళ్లింపుతో సంబంధం ఉన్న ఆస్తులు, వాటి కొనుగోలు విధానం, లబ్ధిదారుల వివరాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ సాహితి ఇన్‌ఫ్రాటెక్ కేసులో సంస్థ ఎండీ బి. లక్ష్మీనారాయణను ఈడీ 2024 సెప్టెంబర్‌లో అరెస్ట్ చేసింది. అనంతరం కేసుకు సంబంధించి దర్యాప్తును కొనసాగించింది. సంస్థపై నమోదైన మనీలాండరింగ్ కేసులో బి. లక్ష్మీనారాయణ, సందు పూర్ణచంద్రరావుపై ఈడీ ప్రాసిక్యూషన్ కంప్లైంట్ దాఖలు చేసింది. ఈ ఫిర్యాదుపై హైదరాబాద్‌లోని ఎంఎస్‌జే కోర్టు ఈ ఏడాది జనవరి 5వ తేదీన కాగ్నిజెన్స్ తీసుకున్నట్లు ఈడీ అధికారిక రికార్డులు వెల్లడిస్తున్నాయి.

# ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలి

జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థే, తన ఎగ్జామినర్ ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు ఆస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు. ఈ మార్పు ఎన్నికల సంఘంపై ప్రజల గౌరవాన్ని, విశ్వాసాన్ని కచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ ఎదుర్కొన్న అనుభవాలను కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏపీలో ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ సమయంలో అధికార పార్టీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, అనేక సందర్భాల్లో తమ విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలోనూ డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్షంగా తాము లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టేశారని అన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

## నేడు గొర్రెలు-మేకల బీమా పథకం అమలు, గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల సమావేశం

**- ఇద్దరు రాష్ట్ర మంత్రుల రాక**

**కరీంనగర్** కరీంనగర్ జిల్లా గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంఘం ఆధ్వర్యంలో, జిల్లాలో ఉన్న గొర్రెలు-మేకల పెంపకం దారులకు నేడు స్థానిక ఇందిరా భవన్ లో ప్రత్యేక సమావేశం జరగనుంది. రాష్ట్ర పశు సంవర్ధక,పాడి పరిశ్రమాభి వృద్ధి, మత్స్య శాఖ మరియు క్రీడలు యువజన వ్యవహారాల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర రవాణా శాఖ మరియు వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్ సరితా, తిరుపతయ్య రాష్ట్ర గొర్రెలు-మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ డా.బి.సుబ్బారాయుడు హాజరు కానున్నారు. సన్న జీవాల పెంపకంలో తరచుగా ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాల వలన నష్టాలు సంభవించడం సర్వసాధారణం. పెంపకం దారులు ఈ నష్టాలను తప్పించుకోవటానికి ఉన్న పరిష్కారం జీవాల బీమా. అలాంటి ఉపయోగకరమైన బీమా పథకం ప్రస్తుతం జీవాల పెంపకం దారులకు అందుబాటులోకి వచ్చింది. నేడు జరగబోయే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఈ గొర్రెలు-మేకల బీమా పథకాన్ని ప్రారంభిస్తారు. 3 వేల రూపాయల ప్రీమియం నుండి 8 వేల రూపాయల వరకు ప్రీమియం ఉండే గొర్రెల బీమా పథకంలోని పూర్తి వివరాలను నేడు కార్యక్రమంలో మంత్రి వివరిస్తారు. నేటి ప్రత్యేక సమావేశంలో జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు, ఆస్తుల పంపిణీ గురించి పలు విషయాలు చర్చించడం జరుగుతుందని, కరీంనగర్ జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖాధికారి డా. ఎన్. లింగారెడ్డి తెలియచేశారు. జిల్లా గొర్రెలు మేకల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షుడు గా నూతనంగా ఎన్నికైన బాసవేని మల్లయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని జిల్లా అధికారి డా. లింగారెడ్డి తెలిపారు.

## ఆళ్లగడ్డలో దోమల నివారణకు గంభూషియా చేప పిల్లలు విడుదల



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లోతట్టు ప్రాంతాలలో, స్థానిక కడప రోడ్డు లోని ఆళ్లగడ్డ పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లోతట్టు ప్రాంతాలలో, స్థానిక కడప రోడ్డు లోని గని గుంతలలో శుక్రవారం 1000 కి పైగా గంబుషియా చేప పిల్లలను వదిలినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాలను తినడం ద్వారా దోమల నియంత్రణకు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ, హెల్త్ ఆఫీసర్ వంగల దస్తగిరి రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, శానిటరీ కార్యదర్శి కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గని గుంతలలో శుక్రవారం 1000 కి పైగా గంబుషియా చేప పిల్లలను వదిలినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాలను తినడం ద్వారా దోమల నియంత్రణకు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ, హెల్త్ ఆఫీసర్ వంగల దస్తగిరి రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, శానిటరీ కార్యదర్శి కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో గిరిజన ప్రాంతాల్లో తీవ్ర నష్టం బాధితులకు సహాయం అందించాలి

**- సుజాత సల్మాన్**

**అరకులోయ** బంగాళాఖాతం అల్పపీడనం వాయుగండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదలతో అల్లూరి జిల్లా వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ తెలిపారు. పలు ప్రభవిత గ్రామాల్లో పర్యటించిన ఆమె ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

భారీ వర్షాలకు పంటలు వరదల్లో కొట్టుకుపోయాయని, ఇళ్లు, రహదారులు దెబ్బతినడంతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు వెంటనే గ్రామాల్లో పర్యటించి పంటలు, ఇళ్లు, రహదారులకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని ఆమె డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి, నష్టపోయిన రైతులు, కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి కరువు జిల్లాగా ప్రకటించి బాధిత ప్రతి కుటుంబానికి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సుజాత సల్మాన్ డిమాండ్ చేశారు.

## సఖి కేంద్రం సేవలు మరింత సమర్థవంతంగా అందించాలి

**- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్**

**కరీంనగర్** మహిళలకు రక్షణ, న్యాయ సహాయం, కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన సేవలను అందిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ సూచించారు. శుక్రవారం ప్యానల్ అడ్వకేట్లతో కలిసి కరీంనగర్ సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన ఆయన, కేంద్రంలో నమోదవుతున్న కేసులు, బాధితులకు అందుతున్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం తదితర సేవలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, కేసు ఫైళ్లు, రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై సమీక్షించారు. షెల్టర్ రూమ్, కౌన్సెలింగ్ గదులు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో పాటు బాధితులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్, సఖి కేంద్రం ద్వారా దాఖలయ్యే గృహహింస కేసులను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖలు, లీగల్ కౌన్సిల్, సఖి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాధితుల గోప్యతను కాపాడుతూ వారి హక్కులు, అందుబాటులో ఉన్న న్యాయ పరిహారాలపై అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయ సహాయం అవసరమైన బాధితులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్ తణుకు, ప్యానల్ అడ్వకేట్లు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, సి.హెచ్. చంద్రప్రకాష్ రెడ్డి, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ దామెర లక్ష్మి, లీగల్ కౌన్సిలర్ ఎన్. సంధ్యారాణి, సోషల్ కౌన్సిలర్ రేణుక, కేస్ వర్కర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# 72వ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలోని ఎస్‌సీవీ బాలుర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 72వ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ మాట్లాడుతూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలను క్రీడాస్ఫూర్తితో స్వీకరించి, గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపు అనేది దైవానుగ్రహంగా భావించాలని, అయితే క్రీడాస్ఫూర్తితో పోటీపడటమే ముఖ్యమని పేర్కొన్నారు.ఈ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించే మొదటి గ్రూప్‌కు తన వంతుగా రూ.1 లక్ష విరాళంగా అందజేస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రకటించారు.అలాగే ఏపీ షాప్ చైర్మన్ రవి నాయుడు క్రీడా మైదానం అభివృద్ధికి ప్రభుత్వం తరపున రూ.1 కోటి నిధులు మంజూరు చేసినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ నిధులతో క్రీడా మైదానాన్ని మరింత అభివృద్ధి చేసి క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శ్రీకాళహస్తిలో నిర్వహించడం పట్ల క్రీడాకారులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలను శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 73వ బూత్‌తో పాటు పాతబస్టాండ్ కూడలిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ హైందవ సిద్ధాంతకర్తగా, ప్రజా నాయకుడిగా దేశానికి విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు.గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు.వ్యక్తి వికాసం, సమాజ హితం, విశ్వ మానవ కల్యాణమే లక్ష్యంగా ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని చెప్పారు.సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తొలి ప్రయోజనం అందాలనే అంత్యోదయ భావనను దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రూపొందించారని కోలా ఆనంద్ తెలిపారు.నిరుపేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తిగా ఆయనను కొనియాడారు. పదవులపై ఆశ లేకుండా సిద్ధాంత నిబద్ధతతో పనిచేసిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు.భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, మానవతా విలువలకు ప్రాధాన్యమిస్తూ జాతీయ పునర్నిర్మాణానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గం స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో చివరి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు అందాలనే ఆయన అంత్యోదయ సంకల్పం నేటికీ ప్రాధాన్యమైందని పేర్కొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాల సాధన దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని కోలా ఆనంద్ అన్నారు.
కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పరిశీలన



వేములవాడ(ప్రశ్న న్యూస్) శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. పనులు వేగంగా పూర్తి చేసేందుకు కావలసిన సిబ్బందిని నియమించి పూర్తి చేయించాలని అన్నారు. పరిశీలనలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఈఈ ఆర్ అండ్ బీ భీమ్లా నాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**డిసెంబర్ 1,2 తేదీలలో ఆక్యుపై ఢిల్లీని జయప్రదం చేయండి**

**సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) కేంద్ర ప్రభుత్వ కార్మిక కార్మిక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడులను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని ఆర్ ఎం ఎల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో డిసెంబర్ 1,2 తేదీలలో జరుగు ఆక్యుపై ఢిల్లీ వాలంటీర్లను ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడులను తెచ్చిందని, వీటిని రద్దు చేసే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారి కాలంలో, మరియు స్వాతంత్రానంతరం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిందని అన్నారు. భారత కార్మికవర్గంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుందని, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టే విధంగా కోడులు తయారు చేశారని అన్నారు. కార్మిక శాఖ, ఫ్యాక్టరీ తనిఖీల శాఖ, అధికారుల పర్యవేక్షణ తొలగించిందని, కార్మికుల భద్రతకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. పరిశ్రమలో రెగ్యులర్గా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు, కాంట్రాక్టు, నీము, ఇతర పథకాల ద్వారా పరిశ్రమలలో కార్మికులను నియమించుకుని ద్వారా ఉత్పత్తులు చేయించుకునే విధంగా చట్టాలు మార్చారని అన్నారు కార్మిక సంక్షేమం, భద్రత అంశాలను తొలగించడం జరిగిందని అన్నారు . కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతుందని అన్నారు నిత్యావసర సరుకుల ధరలు అరికట్టడంలో విఫలమైందని, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచిందని, తాజాగా యూపీఐ చార్జీలు వేసే విధంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. కరెంటు చార్జీలు వసూలు చేసే విధంగా రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తుందని సాధారణ ప్రజలను ఆర్థిక వేధింపులకు గురిచేస్తుంది అని అన్నారు సిఐటియు ఆధ్వర్యంలో డిసెంబర్1,2 తేదీలలో చలో ఆక్యుపై ఢిల్లీ కార్యక్రమాలు జయప్రదం చేయాలని కార్మికవర్గం భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, ఆర్ ఎం ఎల్ యూనియన్ నాయకత్వం వేణుగోపాల్ బిక్షపతి బండ్ల స్వామి చంద్రశేఖర్ రెడ్డి వెంకట్రావు రవికుమార్ రంగారెడ్డి రాజగోపాల్ స్వామి మల్లయ్య విమల పాల్గొన్నారు.

## గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో

# నేడు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. హ్యుందాయ్, క్వెస్, ముత్తూట్ ఫైనాన్స్, డిజిటైడ్, ఎల్‌ఎంఎస్, శివమ్ టెక్నాలజీస్, మేరీనా పెయింట్స్, ఎయిర్‌టెల్ తదితర సంస్థలు పాల్గొననున్నాయి.ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 2024, 2025, 2026 బ్యాచ్‌ల అభ్యర్థులతో పాటు ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులు. అభ్యర్థులు సర్టిఫికెట్లు, రెండు రెజ్యూమేలు, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. శోభారాణి తెలిపారు. వివరాలకు 8985710323ను సంప్రదించాలి.

## నాణ్యమైన విద్య కోసం నిరంతర పోరాటం

**ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి**

**ప్రైవేట్ ఫీజులకు నియంత్రణ చట్టం తేవాలి**

**విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి**



గజ్వేల్ ( ప్రశ్నా న్యూస్ ) తెలంగాణలో నాణ్యమైన విద్య కోసం సమిష్టిగా నిరంతరం పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ మాజీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, విద్యా రంగానికి బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యా బస్సు యాత్ర శుక్రవారం గజ్వేల్ చేరుకోవడంతో టీపీటీఎఫ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ "తెలంగాణ విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఐసీయూలో ఉంది" అని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం ప్రజా ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎంవీ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకర పరిణామమన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు, నిర్వహణ, నాణ్యమైన విద్యను మెరుగుపరచాలని కోరారు.ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేయాలన్న విద్యా కమిషన్ సిఫారసులను అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీఎఫ్, టీపీటీఎఫ్, సీపీఐ, డీబీఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.90,999కు గణేష్ లడ్డూ

**గజ్వేల్ ఎన్‌సీఆర్ ద్వారక వెంచర్‌లో ఉత్కంఠభరిత వేలం**

**ద్వారక వెంచర్ గణపతి లడ్డు వేలం: ?90,999లకు**

**దక్కించుకున్న బుడికె గంగా జీవన్ దాపంతులు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గజ్వేల్‌లోని ఎన్‌సీఆర్ ద్వారక వెంచర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డు వేలం పాట ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కాలనీవాసులు, భక్తులు పోటాపోటీగా పాల్గొన్న ఈ వేలంలో బుడికె గంగా జీవన్ దాపంతులు ?90,999/- (తొంభై వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలు) పలికి స్వామివారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో దక్కించుకున్నారు.లడ్డును కైవసం చేసుకున్న అనంతరం గంగా జీవన్ దాపంతులు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి లడ్డును వేలంలో పొందడం తన పూర్వజన్మ సుకృతమని, గణనాథుడి ఆశీస్సులతో కాలనీ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ వేలం ద్వారా సమకూరిన నిధులను సేవా కార్యక్రమాలకు, రాబోయే ఉత్సవాల నిర్వహణకు వెచ్చించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, వెంచర్ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంతో ముగిసిన వినాయక చవితి స్వర్ణోత్సవ ఉత్సవాలు

**- శాంత్ కుమార్**





సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్) వినాయక చవితి సందర్భంగా గత 11 రోజులుగా నగరంలోని కాలనీల్లో పండగ సందడి నెలకొని గణేష్ నామస్మరణతో మారుమోగింది. శుక్రవారం నాటి గణేష్ నిమజ్జనంతో నగరంలోని వీధులన్నీ ఒక్కసారిగా బోసి పోయాయి. వినాయక చవితి సందర్భంగా బడిచౌడీ, కృపారాంబాగ్ లో వీనస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 11 రోజులుగా విశేష పూజలందుకున్న విఘ్నేశ్వరునికి శుక్రవారం నాడు ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మహ ప్రసాధ నివేదన చేశారు. అనంతరం మహ హారతితో గణేష్ ఉత్సవాలను ముగించి భక్తిశ్రద్ధలతో ఆట పాటల మధ్య వినాయకున్ని ఉరేగింపుగా తరలించి హుసేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసినట్లు శాంత్ కుమార్ తెలిపారు. వినాయక చవితి నుండి నేటి నిమజ్జనం వరకు మండపం నిర్వాహణ, సౌకర్యాల కల్పన, భక్తుల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి గణేష్ నవరాత్రుల స్వర్ణోత్సవ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి వీనస్ అసోసియేషన్ తరపున శాంత్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. స్వామివారి నిమజ్జనం కోసం బయలుదేరే ముందు స్వామివారి లడ్డూను మురళీ (లడ్డు) కుటుంబ సభ్యులకు అందజేసినట్లు శాంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గిరి, సంజయ్, కులకర్ణి, కిషన్ రావు, శర్మాజీ, మురళి (లడ్డు) సుచేంద్ర, దాస్, చిద్విలాస్, శివ, అరుణ్, అభి, అనిల్, ఆమోస్, ప్రతీక్ తదితరులు పాల్గోన్నారని శాంత్ కుమార్ తెలిపారు.

## వైద్యశాఖలో ఫార్మసిస్ట్ పాత్ర ఎంతో కీలకం

**నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం**






నాచారం (ప్రశ్న న్యూస్) వైద్య రంగంలో డాక్టర్ పాత్ర ఎంత ముఖ్యమో, రోగికి సరైన మందులను అందించడంలో ఫార్మాసిస్టుల పాత్ర కూడా అంతే కీలకమని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వహకాధ్యక్షులు వి. వేణుకుమార్ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వి. వేణుకుమార్ మాట్లాడుతు నేటి రోజుల్లో విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్లు వాడటం పెరిగిందని, దీంతో ఆంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పెరిగిపోవడంతో చిన్న చిన్న ఆనారోగ్య సమస్యలకు కూడా మందులు పనిచేయని పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర ప్రాముఖ్యతను సంతరించుకుందని, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వడాన్ని నియంత్రించడంలో ఫార్మసిస్టుల బాధ్యతాయుత పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశంలో కేక్ కట్ చేసి ఆస్పత్రిలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ లను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం బ్రాంచ్ అధ్యక్షురాలు కామ్రేడ్ జి. విక్టోరియా, కార్యదర్శి కామ్రేడ్ వి. వేణు కుమార్ నేతృత్వంలో ఫార్మసీ కేడర్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా

1. ఫార్మసీ ఆఫీసర్ కేడర్‌ను వైద్య శాఖలోని ఇతర విభాగాలతో సమాన స్థాయికి తీసుకురావడం.
2. నాచారం, ఆర్.సి. పురం కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్ గ్రేడ్-I పోస్టులను పదోన్నతి (ప్రమోషన్) ద్వార తక్షణమే భర్తీ చేయడం,
3.ఫార్మసీ సూపర్‌వైజర్ పోస్టులను శాంక్షన్ చేయడం,
4. ఫార్మసిస్టులకు మెరుగైన పదోన్నతి అవకాశాలు, కెరీర్ వృద్ధిని కల్పించడంపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రేడ్-I ఫార్మసిస్టులు రజని, మంజుల దేవి, గ్రేడ్-II ఫార్మసిస్ట్ లు సుమాంజలి, జయప్రద, సమత, స్వాతి, రమేష్, శ్రీనివాస్, శ్రీలత, రాజ్‌కుమార్, సంతోష్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గ సభ్యులు అరుణ, చంద్రకళ, అంజని, శ్రీలత, ఉమ, రాణి, ప్రేమలత, సుజాత చాముండేశ్వరి తదితరులు పాల్గోన్నారు. ప్రతి ఉద్యోగి ఐక్యత . పోరాటం . సంఘీభావం అనే నినాదంతో ముందుకు సాగాలని వేణు కుమార్ పిలుపునిచ్చారు

# కంకర కుప్పలు.. టిప్పర్ల దూకుడు

**- ఇబ్రహీంపట్నం రింగ్‌లో ప్రాణాలతో చెలగాటం - ఓవర్‌లోడింగ్‌తో మితిమీరిన వేగం.. రోడ్డుపై జారిపడుతున్న కంకర**
**- ద్విచక్ర వాహనదారుల్లో భయాందోళన.. అధికారుల తనిఖీలపై ప్రశ్నలు**

**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** ఒకవైపు వాహనాల రద్దీ.. మరోవైపు భారీ టిప్పర్ల దూకుడు.. మధ్యలో ద్విచక్ర వాహనదారుల ప్రాణాలు! ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో పరిస్థితి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కంకర, ఇతర నిర్మాణ సామగ్రిని తరలించే టిప్పర్లు అధిక లోడుతో రాకపోకలు సాగిస్తుండటంతో రహదారిపై మెటీరియల్ పడిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు కొన్ని వాహనాలు వేగంగా దూసుకెళ్తుండటంతో ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ మీదుగా నిత్యం భారీ సంఖ్యలో టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిర్మాణ పనులకు అవసరమైన కంకరను తరలించే క్రమంలో వాహనాల సామర్థ్యానికి మించి లోడింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిప్పర్ బాడీ పరిమితికి మించి కంకరను ఎత్తుగా పోసి తరలిస్తుండటంతో మార్గమధ్యలో కంకర రోడ్డుపై పడుతోందని వాహనదారులు అంటున్నారు.



### రోడ్డుపైనే కంకర..

ఇటీవల ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో భారీగా కంకర పేరుకుపోవడంతో మున్సిపల్ సిబ్బంది రంగంలోకి దిగి దాన్ని తొలగించాల్సి వచ్చింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా సిబ్బంది కంకరను తొలగించారు. అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం ఏమిటన్నదే ప్రశ్నగా మారింది.ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాల నుంచి కంకర రోడ్డుపై పడితే వెనుక నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలకు ప్రమాదం పొంచి ఉంటుందని వాహనదారులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డుపై అకస్మాత్తుగా కంకర కనిపించకపోతే అదుపుతప్పే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వేగానికి అడ్డుకట్ట ఎక్కడ.?

ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ ఇప్పటికే రద్దీగా ఉండే ప్రాంతం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ కలుస్తుండటంతో నిత్యం రాకపోకలు అధికంగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతంలో భారీ టిప్పర్లు వేగంగా ప్రయాణిస్తే చిన్నపాటి పొరపాటు కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.టిప్పర్ల వేగం, లోడింగ్ విధానం, వాహనాల ఫిట్‌నెస్, కవరింగ్, పర్మిట్, డ్రైవింగ్ నిబంధనల అమలు వంటి అంశాలపై సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని వాహనదారులు కోరుతున్నారు.

### చర్యలు ఎప్పుడు?

ఓవర్‌లోడింగ్ చేస్తున్న వాహనాలపై రవాణా శాఖ, పోలీసు శాఖలు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో భారీ వాహనాల వేగ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.
టిప్పర్ల ద్వారా నిర్మాణ సామగ్రి రవాణా చేయడం సాధారణమే అయినప్పటికీ, అది ఇతర వాహనదారుల భద్రతకు ముప్పుగా మారకుండా నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత యంత్రాంగంపై ఉంది. వాహనాలపై పరిమితికి మించి లోడ్ చేస్తున్నారా? లోడ్ రవాణా సమయంలో తగిన రక్షణ చర్యలు తీసుకుంటున్నారా? రోడ్డుపై పడుతున్న కంకరను అరికట్టేందుకు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వాల్సి ఉంది.ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో పరిస్థితిని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టడం ముఖ్యమని వారు పేర్కొంటున్నారు.

# రికార్డు స్థాయిలో బాలాపూర్ లడ్డూ వేలం

**వేలం పాటలో 39 లక్షలకు లడ్డూ దక్కించుకున్న అర్బన్ గ్రూప్ అఫ్ కంపెనీ చైర్మన్ సామ ప్రణీత్ రెడ్డి**

బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) వినాయక ఉత్సవాల్లో బాలాపూర్ వినాయకుడికి ప్రత్యేక స్థానం ఉంది. విఘ్నేశ్వరునికి సమర్పించే లడ్డూ ప్రసాదం ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటుంది. గణేష్ నవరాత్రుల్లో భాగంగా స్వామి వారి చేతిలోని 21 కిలోల లడ్డూను వేలం పాటలో దక్కించుకోవడంతో సుఖ సంతోషాలు, ఐశ్వర్యం, శుభ ఫలితాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలాంటి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణనాథుడి లడ్డూను దక్కించుకునేందుకు ప్రతి సంవత్సరం భక్తుల్లో తీవ్ర పోటీ నెలకొంటుంది. వేలం పాటలో సరికొత్త రికార్డులతో ఏ ఏడుకాఏడు బాలాపూర్ లడ్డూ ప్రత్యేకత మరింత పెరుగుతోంది. లడ్డూ వేలం ప్రారంభమైన నాటి నుంచి వేలం పాటలో తన రికార్డును తానే అధిగమిస్తూ బాలాపూర్ గణేష్ లడ్డూ చరిత్రను తిరగరాస్తుంది. 1994 లో కేవలం 450 రూపాయలతో ప్రారంభమైన బాలాపూర్ లడ్డూ వేలం, అంచెలంచెలుగా పెరుగుతు నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రతి సంవత్సరం వేలం ధర పెరుగుతుండటంతో బాలాపూర్ లడ్డూ వేలంపై ప్రజల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. బాలాపూర్ లడ్డూను దక్కించుకుంటే అదృష్టం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల్లో ఉన్న విశ్వాసం వేలం పాటలో పోటీకి ప్రధాన కారణంగా నిలుస్తోంది. దీంతో ప్రతి ఏడాది వేలం పాట ఉత్కంఠభరితంగా సాగుతుంది. లడ్డూ అంటే బాలాపూర్ – బాలాపూర్ అంటే లడ్డూ అనే స్థాయిలో ఈ వేలం పాటకు గుర్తింపు వచ్చింది. సంవత్సరాలు గడిచేకొద్దీ వేలం ధరలోనే కాకుండా బాలాపూర్ లడ్డూ ఖ్యాతి కూడా అంచెలంచెలుగా పెరుగుతు ప్రాముఖ్యతను సంతరించుకుంది.





### రికార్డు స్థాయిలో లడ్డూ వేలం

2026 లో పోటాపోటీ జరిగిన లడ్డూ వేలం పోటీలో సాహెబ్ నగర్ కు చెందిన అర్బన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ సామ ప్రణీత్ రెడ్డి 39 లక్షలకు దక్కించుకున్నాడు. అయితే గత సంవత్సరాని కంటే ఈసారి నాలుగు లక్షల అధికం. 2025లో 35 లక్షలకు లింగాల దశరథ్ గౌడ్ బాలాపూర్ లడ్డును దక్కించుకున్నారు. భారీ బందోబస్తు మధ్య లడ్డూ వేలం ముగిసిన తర్వాత గణనాథుడు నిమజ్జనానికి ఉసేన్ సాగర్ కు బయలుదేరాడు.
1994 నుండి 2026 వరకు గణేష్ బాలాపూర్ లడ్డూను దక్కించుకున్న వారి వివరాలను గమనిస్తే
1994 కోలన్ మోహన్ రెడ్డి 450
1995 కోలన్ మోహన్ రెడ్డి 450
1996 కోలన్ కృష్ణారెడ్డి 18,000
1997 కోలన్ కృష్ణారెడ్డి 28,000
1998 కోలన్ మోహన్ రెడ్డి 51,000
1999 కళ్లెం అంజిరెడ్డి 65,000
2000 కళ్లెం ప్రతాప్ రెడ్డి 66,000
2001 గొండోజి రఘునందన చారి 85,000
2002 కందాడ మాధవరెడ్డి 1,0,5000
2003 చిగురింత బాల్ రెడ్డి 1,55,000
2004 కోలన్ మోహన్ రెడ్డి 2,01,000
2005 ఇబ్రహీం శేఖర్ 2,08,000
2006 చిగురింత తిరుపతి రెడ్డి 3,00,000
2007 గుండోజి రఘు నందన చారి 4,15,000
2008 కోలన్ మోహన్ రెడ్డి 5,07,000
2009 సరిత 5,10,000
2010 కోడాలి శ్రీధర్ బాబు 5,35,000
2011 కోలన్ బ్రదర్స్ 5,45,000
2012 పన్నాల గోవర్ధన్ రెడ్డి 7,50,000
2013 తీగల కృష్ణారెడ్డి 9,26,000
2014 సింగిరెడ్డి జైహింద్ రెడ్డి 9,50,000
2015 కళ్లెం మదనమోహన్ రెడ్డి 10,32,000
2016 కందాడి స్కైలాబ్ రెడ్డి 14,65,000
2017 నాగం తిరుపతిరెడ్డి 15,60,000
2018 తెరటి పల్లి శ్రీనివాస్ గుప్త 16,60,000
2019 కోలన్ రామిరెడ్డి 17,60,000
2020 కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కరోనా ప్రభావంతో వేలం జరగలేదు. అప్పటి ముఖ్యమంత్రి పేరున సమర్పించారు)
2021 రమేష్ యాదవ్, మర్రి శశాంక్ రెడ్డి 18,90,000
2022 ఒంగేటి లక్ష్మారెడ్డి 24,60,000



2023 దాసరి దయానంద రెడ్డి 27,00,000
2024 కోలన్ శంకర్ రెడ్డి 30,01,000
2025 లింగాల దశరథ గౌడ్ 35,00,000
2026 అర్బన్ గ్రూప్ కంపెనీ చైర్మన్ సామ ప్రణీత్ రెడ్డి 39 లక్షలకు గణేష్ లడ్డూ సొంతం చేసుకున్నారు. వినాయక చవితి నుండి నేటి నిమజ్జనం వరకు లక్షలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, ఊహించినదానికన్న ఎక్కువగా తండోపతండాలుగా భక్తులు తరలివచ్చిను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించి అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ వినాయక నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ తరపున చైర్మన్ నిరంజన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో వైయస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారు కుటుంబం

**- -2019లో ఆరోగ్యశ్రీ కింద తమ కుమార్తెకు న్యూరో సర్జరీ జరిగిందని కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు**
**- చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వైయస్ జగన్**

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో నూజివీడు నియోజకవర్గం కొర్లగుంటకు చెందిన మహేష్, వినీల దంపతులు తమ కుమార్తె ధన్సికతో కలిసి కలిశారు.2019లో శ్రీ వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే, తమ కుమార్తె ధన్సిక రెండు నెలల పాపగా ఉన్న సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురైందని వారు వివరించారు. ఆ సమయంలో ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అత్యంత క్లిష్టమైన న్యూరో సర్జరీ ఉచితంగా జరిగిందని, ఆ చికిత్సతో తమ కుమార్తె కోలుకుందని వైయస్ జగన్‌కు తెలిపారు.ఆపరేషన్ తర్వాత తమ కుమార్తె ఆరోగ్యంగా పెరుగుతోందని, నాడు తమ కుటుంబానికి అందిన సహాయాన్ని జీవితంలో మరిచిపోలేమని మహేష్, వినీల దంపతులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రీ వైయస్ జగన్‌ను గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా చిన్నారి ధన్సికను ఆప్యాయంగా పలకరించిన శ్రీ వైయస్ జగన్, ఆమె ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని చిన్నారికి సూచించి ఆశీర్వదించారు. చిన్నారి, ఆమె తల్లిదండ్రుల కోరిక మేరకు వారితో కలిసి సెల్ఫీ దిగారు.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా తమ కుమార్తెకు అందిన వైద్య సహాయాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని, తమ కుటుంబానికి జరిగిన మేలుకు ఎప్పటికీ రుణపడి ఉంటామని మహేష్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## మంగళగిరిలో నకిలీ మద్యం కలకలం..

**ఏపీఎస్‌బీసీఎల్ యాప్‌లో స్కాన్ కాని మద్యం బాటిల్**

గుంటూరు జిల్లా మంగళగిరిలో నకిలీ మద్యం కలకలం రేపుతోంది. స్థానికంగా ఉన్న లిక్కర్ మార్ట్‌లో విక్రయిస్తున్న మద్యం బాటిల్ ప్రభుత్వ అధికారిక యాప్‌లో స్కాన్ కాకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.మంగళగిరి పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఉన్న లిక్కర్ మార్ట్‌లో ఓ వ్యక్తి బ్లెండర్స్ ప్రైడ్ (ఃశ్రీవనిటవతీ'బ ఖతీతిటవ) విస్కీ బాటిల్ కొనుగోలు చేశారు. అనుమానంతో ఆ బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ప్రభుత్వ అధికారిక ంఖూఃఅఐ అనీనిబబీఎవతీ ఖనీతీబిజీశ్రీ యాప్‌లో స్కాన్ చేయగా "ఖీీ అనీటవ ఔనీబి ఈనీబీనిట / ఇతీతీనీతీ" అని చూపించింది.దీంతో అది కల్తీ, నకిలీ మద్యం అని బాధితుడు ఆరోపిస్తున్నారు. మంగళగిరిలోని లిక్కర్ మార్ట్‌లలో ఇలాంటి నకిలీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీడియోలో హెచ్చరించారు.నకిలీ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అన్ని శాఖల అనుసంధానంతో**

## రైతులకి లబ్ది చేరే ప్రక్రియ

**- మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ** కూటమి అధికారంలోకి వచ్చాక కళ్యాణ్ చొరవతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పెరిగింది. 12గంటల లోపే ధాన్యం డబ్బులు రైతుల కథలో వేడి చరిత్ర సృష్టించం. దీనివెనుకాల చాలా కృషి ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. 2619 ధాన్యం కొనుగోలు కేంద్రాలు నవంబర్ ఒకటి నుంచి ఏర్పాటు చేస్తున్నాం. 31000ట్రాన్స్పోర్ట్ వెహికల్స్ ఐజూబ అవకాశం కూడా కల్పించి చేస్తున్నాం. మొదటిసారి ట్రాన్స్పోర్ట్ చార్జెస్ రైతుల కాటలో వేసే కొత్త సంస్కరణ ప్రారంబించాంఎ ఎల్నినో ప్రభావం కారణంగా ఇబ్బందులు ఎదురు అవుతాయి అనుకునం కానీ వర్షాలు కొంత ఊరట కల్పించాయి. అన్ని శాఖల అనుసంధానంతో రైతులకి లబ్ది చేరే ప్రక్రియ చేస్తాం. రైతులు అందుబాటులో మిల్ దగ్గరకి ట్రాన్స్పోర్ట్ చేస్కునే విధంగా ఏర్పటు చేసాం. గతంలో కోటి అరవై లక్షలు ధాన్యం ఏర్పాటు చేస్తే ఇపుడు ఎల్నినో వల్ల కోటి పడి లక్షలకు చేరిందని అన్నారు.పరిస్థితి బాగుంటే భవిష్యత్తులో ఇంకా మార్పులు ఉంటాయని అయన అన్నారు.

## వినాయక నిమజ్జనాలు

## త్వరగా ముగించుకోవాలి

**- సీఐ ఎస్ వి ఎస్ మూర్తి**



**గోకవరం** మండలం లో వినాయక చవితి మహోత్సవాలు సందర్భంగా గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అక్కడక్కడ ఇంకా గణేష్ మండపాలు ఉండడంతో ఇంకా మిగిలి ఉన్న విగ్రహాలు శని ఆదివారాల్లో నిమజ్జన కార్యక్రమాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించుకుని చీకటి పడకుండా ఉదయం పూటే నిమజ్జనం కార్యక్రమాలు ఊరేగింపు కార్యక్రమాలు ముగించాలి అని ముఖ్యంగా ఈ వర్షాల వల్ల నదులు చెరువులు పూర్తిగా నిండి ఉండడంతో భక్తులు గమనించుకుని గణేష్ నిమజ్జనాలు చేయాలని అలాగే నిమజ్జనాలకు ఉపయోగించే వాహనాలు ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా మద్యం సేవించి వాహనాలు నడపకూడదు అని కమిటీ వారికి సిఐ మూర్తి శుక్రవారం పోలీస్ స్టేషన్ ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కు విజ్ఞప్తి చేశారు..వినాయక నిమజ్జనాలు. త్వరగా ముగించుకోవాలి..సీఐ ఎస్ వి ఎస్ మూర్తి ..గోకవరం మండలంలో వినాయక చవితి మహోత్సవాలు సందర్భంగా గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అక్కడక్కడ ఇంకా గణేష్ మండపాలు ఉండడంతో ఇంకా మిగిలి ఉన్న విగ్రహాలు శని ఆదివారాల్లో నిమజ్జన కార్యక్రమాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించుకుని చీకటి పడకుండా ఉదయం పూటే నిమజ్జనం కార్యక్రమాలు ఊరేగింపు కార్యక్రమాలు ముగించాలి అని ముఖ్యంగా ఈ వర్షాల వల్ల నదులు చెరువులు పూర్తిగా నిండి ఉండడంతో భక్తులు గమనించుకుని గణేష్ నిమజ్జనాలు చేయాలని అలాగే నిమజ్జనాలకు ఉపయోగించే వాహనాలు ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా మద్యం సేవించి వాహనాలు నడపకూడదు అని కమిటీ వారికి సిఐ మూర్తి శుక్రవారం పోలీస్ స్టేషన్ ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కు విజ్ఞప్తి చేశారు..

# చదువు చెప్పడమే కాదు.. పాఠశాల అభివృద్ధే ధ్యేయం

**విద్యార్థుల సంఖ్య 15 నుంచి 50కి పెంచిన ఉపాధ్యాయుడు రమణయ్యకు ఘన సన్మానం**

కనిగిరి(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే కాకుండా, సొంత నిధులతో వసతులు కల్పిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు రమణయ్యను విద్యాశాఖ అధికారులు అభినందించి సన్మానించారు. పొదిలిలోని శ్రీ సాయి బాలాజీ కల్యాణ మండపంలో శుక్రవారం పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచిన ఉపాధ్యాయులకు ప్రోత్సాహం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో పీసీపల్లి మండలం వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రమణయ్య సేవలను అధికారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత విద్యా సంవత్సరంలో 15 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో వివిధ గ్రామాల్లో తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను వివరించి ఈ విద్యా సంవత్సరంలో మరో 35 మంది విద్యార్థులను చేర్పించారు. దీంతో విద్యార్థుల సంఖ్య 50కి చేరింది. పీసీపల్లి మండలంలోనే అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన పాఠశాలగా నిలిచింది.

### సొంత నిధులతో రూ.1.50 లక్షల ఖర్చు

విద్యార్థుల సంఖ్య పెరగడంతో వారికి మెరుగైన విద్య అందించేందుకు రమణయ్య తన సొంత నిధుల నుంచి సుమారు రూ.1.50 లక్షలు వెచ్చించి విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేశారు. అదనపు బోధనతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.రమణయ్య గతంలో పనిచేసిన పాఠశాలల్లోనూ ఇదే తరహాలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేశారని అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి సొంత నిధులతో పాటు దాతల సహకారం కూడా సమీకరించారని చెప్పారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా పెరగడంతో 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టే స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు.

### యోగాలో జాతీయ స్థాయికి..

విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ శిక్షణ ఇస్తున్నారని అధికారులు తెలిపారు. విద్యార్థులను యోగాలో తీర్చిదిద్ది జాతీయ స్థాయి పతకాలు సాధించేలా శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. అలాగే నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలు పొందేలా అదనపు సమయం కేటాయించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.
విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్న రమణయ్యను అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు, జిల్లా అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజాల కొండారెడ్డి, జిల్లా మీడియా అధికారి రామిరెడ్డి, డిప్యూటీ డీఈఓ సంజీవ్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు సన్మానించారు.డిప్యూటీ డీఈఓ సంజీవ్, ఎంఈఓ శ్రీనివాసులు రమణయ్య సేవలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లాలోని విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# వరద ముంపులో 'మన్యం' పోలీస్ అండ

- విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు భరోసా.. విస్తృతంగా సహాయక చర్యలు
- డ్రోన్లతో ముంపు ప్రాంతాలపై నిఘా..
- ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరికలు
- రహదారులపై కూలిన చెట్ల తొలగింపు.. పొంగుతున్న వాగుల వద్ద బందోబస్తు







**పార్వతీపురం మన్యం(ప్రశ్న న్యూస్)** అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలకు అండగా నిలుస్తూ.. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపడుతోంది. రెవెన్యూ, ఎన్‌డీఆర్ఎఫ్, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ పోలీసులు క్షేత్రస్థాయిలో సహాయక, రక్షణ చర్యలు కొనసాగిస్తున్నారు.'ప్రజల భద్రతే తొలి ప్రాధాన్యం' అన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారని జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన ప్రాంతాల్లో సిబ్బందిని మోహరించినట్లు పేర్కొన్నారు.

### డ్రోన్లతో ముంపుపై నిఘా

వరద నీరు చేరిన, సాధారణంగా వెళ్లేందుకు అవకాశం లేని ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ముంపు ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించి అక్కడ చిక్కుకున్న ప్రజల వివరాలను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నారు.అవసరమైన ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

### ప్రమాద ప్రాంతాల వద్ద కట్టడి

నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లోకి ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు వెళ్లకుండా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.వాగులు, కల్వర్టులు పొంగిపొర్లుతున్న ప్రాంతాల్లో రాకపోకలను నియంత్రిస్తున్నారు. నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉన్న చోట ప్రజలు రహదారులు దాటకుండా అడ్డుకుంటూ, అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించేలా సూచనలు చేస్తున్నారు.

### చెట్లు పడితే.. వెంటనే రంగంలోకి

భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులపై చెట్లు విరిగిపడుతున్న నేపథ్యంలో పోలీసులు వెంటనే స్పందిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే సిబ్బంది ఘటనా స్థలాలకు చేరుకుని జేసీబీలు, ఇతర అవసరమైన పరికరాల సహాయంతో చెట్లను తొలగిస్తున్నారు. రహదారులను వీలైనంత త్వరగా క్లియర్ చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### 'ప్రజలు సహకరించాలి'

వరదలు, భారీ వర్షాల సమయంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణాలు చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. నీటి ప్రవాహం ఉన్న వాగులు, కల్వర్టులు, రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరిస్తున్నారు. అధికారుల సూచనలను పాటించి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరుతున్నారు.జిల్లాలో వర్షాలు, వరదల పరిస్థితిని పోలీస్ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ప్రతి ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**హుజురాబాద్** బిజెపి హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి మొక్కలు నాటారు. మొక్కలు నాటారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజురు మాట్లాడుతూ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారు దేశం కోసం, సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని అన్నారు. భారతీయ జనసంఘ్‌కు ఆయన అందించిన సేవలు, పార్టీ సిద్ధాంతాల నిర్మాణంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారు ప్రతిపాదించిన "ఏకాత్మ మానవవాదం" భారతీయ జీవన విధానం, సంస్కృతి, విలువలకు అనుగుణంగా సమాజంలోని ప్రతి వ్యక్తి సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న గొప్ప ఆలోచనా విధానమని తూర్పాటి రాజు తెలిపారు.సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే "అంత్యోదయ" సిద్ధాంతాన్ని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారు దేశానికి అందించారని అన్నారు. పేదలు, బలహీన వర్గాలు, అణగారిన ప్రజల సంక్షేమమే నిజమైన ప్రజాసేవకు ప్రామాణికమని ఆయన చూపించిన మార్గంలో ప్రతి బీజేపీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి అంత్యోదయ స్ఫూర్తిదాయకంగ పేదలకు ఇళ్లు, ఉచిత వైద్యం,ఉచిత రేషన్,బ్యాంకు ఖాతాలు, గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్లు, తాగునీరు, రైతులకు సంక్షేమ పథకాలు వంటి అనేక కార్యక్రమాల లక్ష్యం సమాజంలోని చివరి వ్యక్తిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేశారు .దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి ఆశయాలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని, ఆయన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజంలోని పేదలు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని తూర్పాటి రాజు అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు,జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు తిప్పబత్తిని రాజు గంట సంపత్ 23వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి దుర్గ పట్టణ ఉపాధ్యక్షులు ఇల్లందుల ప్రణీత్ పట్టణ కార్యదర్శిలు కుసుమ సమ్మయ్య బోడిగే రాధా బోరగాల సారయ్య నీలం రవీందర్ గంధం అనిల్ పురాణం శ్రీనివాస్ తూర్పాటి రామచంద్రం పర్థం విజయ్ తూర్పాటి రాజ్ కుమార్ తూర్పాటి రమేష్ భూతం సాయిరాం తూర్పాటి ఐలయ్య తూర్పాటి సురేష్ తూర్పాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో బస్ గుర్తుకు వోటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



**ఆసిఫాబాద్** ఆర్టీసీ విలీనం,కార్మిక హక్కులు ఎంప్లాయిస్ యూనియన్ తోనే సాధ్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు.శుక్రవారం రోజున ఆసిఫాబాద్ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్(ంమిజఅ) ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలన ఆర్టీసీ నష్టాల్లోకి వెళ్లిందని అన్నారు,ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించి,విలీనం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల్లో కార్మికులను మోసం చేసిందని అన్నారు,ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు,ఆర్టీసీ కార్మిక హక్కులు ఇజ తోనే సాధ్యమని అన్నారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం,కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని,అధికారుల వేధింపులు తగ్గిస్తామని,పిఆర్సి డబ్బులు పెండింగ్లో ఉన్న ,అఊ డబ్బులు ఇప్పిస్తామని అన్నారు. బ్రెడ్ విన్నెర్స్ స్కీం కింద ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ దే అని అన్నారు,డిపోలో కార్మికుల సమస్యలు పరిష్కారం చేసిన ఘనత ఇజ దేనని,ఎన్నికలలో కార్మికులు బస్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుచున్నాము,2017,2021 ఖఖీఅ బకాయిలు ఉద్యోగులకు ఇప్పించిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ అని అన్నారు,అలాగే 2025 కు సంబంధించి మెరుగైన వేతన సవరణ చేస్తామని,గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం.ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కోసం ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తాం,డ్రైవర్, కండక్టర్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని,అఊ డబ్బులు ఇప్పిస్తామని,గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కోసం ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తాం,కార్యక్రమంలో ంమిజఅ జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఇజ డిపో సెక్రటరీ ఏల్పుల అశోక్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఖీఖ సింగ్, రీజినల్ సహాయ కార్యదర్శి రఫిక్,గ్యారేజి కార్యదర్శి రవికుమార్తోపాటు పాల్గొన్నారు

# ముందస్తు మూసివేత.. తప్పిన పెను ముప్పు

- ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డుపై కొండచరియలు విరిగిపాటు
- మూడు రోజుల ముందే రాకపోకలు నిలిపివేత.. లేకుంటే.?
- ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్.. భద్రతా చర్యలకు ఆదేశాలు





**ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్)** ఎడతెరిపిలేని భారీ వర్షాలతో ఇంద్రకీలాద్రిపై కొండచరియలు విరిగిపడ్డాయి. గురువారం రాత్రి ఘాట్‌రోడ్డుపై భారీ బండరాళ్లు, రాతిపెళ్లలు, మట్టి జారిపడటంతో కలకలం రేగింది. అయితే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మరమ్మతు పనుల కోసం మూడు రోజుల ముందుగానే ఘాట్‌రోడ్డును పూర్తిగా మూసివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో వాహనాలు, భక్తుల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు.ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ శుక్రవారం ఉదయం దేవస్థాన ఈవో వి.కె. శీనా నాయక్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఘాట్‌రోడ్డులోని ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించారు. కొండపై నుంచి జారిపడిన భారీ బండరాళ్లు, మట్టి, రాతిపెళ్లలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.

### యుద్ధప్రాతిపదికన తొలగింపు

ఘాట్‌రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, రాళ్లను పొక్లెయిన్లు, క్రేన్ల సహాయంతో తొలగించి మార్గాన్ని శుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాకపోకలకు మార్గం సురక్షితంగా మారే వరకు పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు.భారీ వర్షాలతో కొండపై నీటి ఊటలు ఏర్పడి మట్టి నానిపోయిన నేపథ్యంలో మరోచోట కొండచరియలు జారే ప్రమాదం ఉందా? అనే అంశాన్ని సాంకేతిక నిపుణులతో సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న వదులైన రాళ్లను ముందుగానే గుర్తించి నియంత్రిత పద్ధతిలో తొలగించాలని స్పష్టం చేశారు.

### రిటైనింగ్ వాల్‌కు పటిష్టత

కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో రిటైనింగ్ వాల్, ఐరన్ ఫెన్సింగ్, రాక్‌ఫాల్ నెట్లను మరింత పటిష్టంగా పునరుద్ధరించాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత భద్రతా చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఘాట్‌రోడ్డుపై భద్రతా తనిఖీలు పూర్తయ్యే వరకు ఎవరినీ అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

### ముందస్తు అప్రమత్తతతో..

దేవస్థాన ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో దేవస్థానం యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందన్నారు. గురువారం రాత్రి తాను ఘాట్‌రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా ఘాట్‌రోడ్డును మూసివేయడం వల్ల పెద్ద ముప్పు తప్పిందన్నారు.దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ కార్యదర్శి కె.కన్నబాబు, కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఘాట్‌రోడ్డు పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారని ఈవో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ బృందాలు రంగంలోకి దిగి కొండచరియల తొలగింపు, భద్రతా చర్యలను వేగవంతం చేశాయని పేర్కొన్నారు.పరిస్థితిని పూర్తిగా అంచనా వేసిన అనంతరం మాత్రమే ఘాట్‌రోడ్డును పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ చర్యలు కొనసాగుతున్నాయి.ఈ పరిశీలనలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.రమ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## అధ్యాపకుడు ఎ. కపిల్‌కు విశిష్ట సాహిత్య పురస్కారాలు?



ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు, యువ కవి ఎ. కపిల్‌ను వరుస సాహిత్య పురస్కారాలు వరించాయి. ఇటీవల వివిధ సాహితీ సంస్థలు నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి కవితల పోటీల్లో ఆయన విశేష ప్రతిభ కనబరిచి నిర్వాహకుల ప్రశంసలు అందుకున్నారు. తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, ఉషోదయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని రాసిన కవితకు గాను 'ప్రథమ విజేత'గా నిలిచి 'గుర్రం జాషువా సేవా సౌరభం' బిరుదును దక్కించుకున్నారు. అలాగే డాక్టర్ బోయి భీమన్న జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో చక్కని కవితా శిల్పంతో అలరించినందుకు 'డాక్టర్ బోయి భీమన్న చైతన్య దీప్తి' బిరుదుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ?దీంతో పాటు, మహాకవి శ్రీ గురజాడ వెంకట అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఆర్గనైజేషన్ ఆఫ్ గ్లోబల్లీ యునైటెడ్ టీచర్స్ (గా'ఉజు) ? సాహితీ విభాగం నిర్వహించిన ఆన్‌లైన్ కవితా పోటీలలో విశేష ప్రతిభ కనబరిచినందుకు గాను ఎ. కపిల్‌కు ప్రత్యేక ప్రశంసా పత్రం లభించింది. గా'ఉజు సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వి. రాఘవరావు, రాష్ట్ర కార్యదర్శి కె. శంకర్ రావు, మహిళా విభాగం బాధ్యులు పి. వి. ఎం. నాగ జ్యోతి, గంపల బి. వి. గంగాభవాని ఆయన విలువైన సాహితీ సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ?కళాశాల తెలుగు ఉపన్యాసకుడు ఎ. కపిల్‌కు ఇటువంటి ప్రతిష్టాత్మక సాహిత్య బిరుదులు, ప్రశంసా పత్రాలు లభించడం కళాశాలకే ఎంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ కొనియాడారు. బోధనతో పాటు సాహితీ రంగంలో నిరంతరం శ్రమిస్తూ ఉత్తమ పురస్కారాలు అందుకుంటున్న ఆయనను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు.?తెలుగు విభాగాధిపతి ఎస్.కె. ముజీబ్ మాట్లాడుతూ కపిల్ నిరంతర సాహిత్య పిపాస, సామాజిక స్పృహతో కూడిన రచనలు ఎందరికో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

# వాకింగ్ ట్రాక్‌కు మరింత వైభవం!

- కొరిటెపాడు ట్రాక్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

**గుంటూరు(ప్రశ్న న్యూస్)** కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ వైభవాన్ని మరింత పెంచేందుకు నూతన కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సూచించారు. శుక్రవారం కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ పశ్చిమ నియోజకవర్గంలోనే ప్రతిష్టాత్మకమైన ట్రాక్‌లలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. సుమారు 800 మీటర్ల పొడవుతో ఉన్న ఈ ట్రాక్ 25 ఏళ్లుగా వేలాది మందికి ఆరోగ్యం, ఆహ్లాదాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.ట్రాక్ అభివృద్ధికి సింగంశెట్టి కోటేశ్వరరావు ఎంతో కష్టపడి, నిజాయితీగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. నూతన కమిటీ సభ్యులంతా సమన్వయంతో పనిచేసి ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు.

### బోటింగ్ సౌకర్యంపై పరిశీలన

వాకింగ్ ట్రాక్ వద్ద బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, వెనుక వైపు గేటు కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని పలువురు పెద్దలు సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయా అంశాలను పరిశీలించి సాధ్యమైన మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ట్రాక్‌లోని స్థానిక సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను తమ దృష్టికి తీసుకురావాలని నూతన కమిటీకి సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని



హామీ ఇచ్చారు.రానున్న రోజుల్లో అందరి సహకారంతో కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేసి, నగరవాసులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు

# 'హాయ్' మూవీ రివ్యూ!



బుల్లి తెరపై నుంచి వెండితెర వరకూ ఎదిగిన నటులలో కెవిన్ రాజ్ ఒకరుగా కనిపిస్తాడు. కథానాయకుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కెవిన్, నయనతారతో కలిసి నటించిన సినిమానే 'హాయ్'. విష్ణు దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఆగస్టు 28వ తేదీన విడుదలైంది. రాధిక . ప్రభు .. భాగ్యరాజ్ .. సుహాసిని కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, తమిళంతో పాటు తెలుగు .. కన్నడ .. మలయాళ భాషల్లో ఈ రోజు (సెప్టెంబర్ 25) నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది.సుబ్రమణ్యం (కెవిన్) ఒక రకంగా కలవారి కుటుంబానికి చెందిన అబ్బాయే. ప్రమీల దంపతులు ( రాధిక – భాగ్యరాజ్) సుబ్రమణ్యానికి పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెడతారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకోవాలనేది సుబ్రమణ్యానికి ఉన్న కోరిక. తాను ఇష్టపడిన అమ్మాయిలు తనని ఎంతమాత్రం పట్టించుకోకపోవడం అతనికి చాలా అసంతృప్తిని కలిగిస్తుంది. అందువలన తనకి తగిన అమ్మాయికి కోసం వెతుక్కుంటూ అతను హైదరాబాద్ కి చేరుకుంటాడు. అక్కడే ఒక సంస్థలో జాబ్ చేస్తూ ఉంటాడు.ఇక దేవసేన (నయనతార) తండ్రి చంద్రం (ప్రభు) ఒక తాగుబోతు. భార్య ఇల్లొదిలి వెళ్లిపోయిన దగ్గర నుంచి అతను తాగుడికి బానిస అవుతాడు. తన కోసం భార్య తప్పకుండా తిరిగొస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ ఉంటాడు. తాగుడు కోసం అతను చేసిన అప్పు తీర్చమని దొరబాబు ఒత్తిడి చేస్తుంటాడు. లేదంటే దేవసేనను తనకిచ్చి పెళ్లి చేయమని పోరుతుంటాడు. ఈ నేపథ్యంలో దేవసేన పారిపోయి హైదరాబాద్ కి చేరుకుంటుంది. అక్కడే ఆమెకి 'సుబ్బు' తారసపడతాడు. ఇద్దరి మధ్య పరిచయం పెరుగుతుంది. దేవసేనతో సాన్నిహిత్యం పెరుగుతున్నా కొద్దీ సుబ్బుకి ఆమెపై ప్రేమ పెరిగిపోవడం మొదలవుతుంది. ఆమె పట్ల తనకి గల ప్రేమను బయటపెట్టే సమయం కోసం అతను ఎదురుచూస్తుంటాడు. అయితే సుబ్బు పట్ల దేవసేన స్నేహంగా మాత్రమే ఉంటుంది. జీవితంలో స్థిరపడటం కోసం 'లండన్' వెళ్లే ప్రయత్నాలలో ఉంటుంది. తన మనసులోని మాటను సుబ్బు చెప్పలేడు .. ఆమెను ఆపలేడు. అలాంటి పరిస్థితులలో అతను సతమతమైపోతుంటాడు. సుబ్బు – దేవసేన లేచిపోయారనీ, ఇద్దరూ కలిసి హైదరాబాద్ లో ఉంటున్నారనే విషయం ఇరు కుటుంబాలకు తెలుస్తుంది. దాంతో వాళ్లంతా ఒక్కసారిగా వచ్చేసి ఇద్దరినీ నిలదీస్తారు. ఆ కంగారులో సుబ్బు, తాను దేవసేనను ప్రేమిస్తున్నాననీ .. తన కారణంగా ఆమె నెల తప్పిందని చెబుతాడు. దాంతో చంద్రం చేసిన అప్పు తీర్చేసి, దేవసేనను తమ కోడలిగా చేసుకోవడానికి ప్రమీల దంపతులు అంగీకరిస్తారు. అప్పుడు దేవసేన ఏం చేస్తుంది? ఆమె తల్లి ఇల్లొదిలి ఎందుకు వెళ్లిపోతుంది? దేవసేన లండన్ వెళ్లిపోతుందా? సుబ్బుతో పెళ్లికి ఒప్పుకుంటుందా? అనేది మిగతా కథ.ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే పట్టుదలతో పట్నానికి వచ్చిన హీరో. నచ్చని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక పారిపోయి పట్నానికి చేరుకున్న హీరోయిన్ మధ్య పరిచయం జరుగుతుంది. అతని వైపు నుంచి ఆమె పట్ల ఉన్నది ప్రేమ. ఆమె వైపు నుంచి అతని పట్ల ఉన్నది స్నేహం. హీరో తన పేరెంట్స్ తో చెప్పిన ఒక అబద్ధం కారణంగా, అతని ఇంటికి ఆమె వెళ్లవలసి వస్తుంది. అతను చెప్పినట్టుగా నటించాల్సి వస్తుంది. ఫలితంగా చోటుచేసుకునే సన్నివేశాల చుట్టూ అల్లుకున్న కథ ఇది.హీరో .. హీరోయిన్ పారిపోయి చెరో దారిలో హైదరాబాద్ చేరుకోవడం .. అక్కడ ఇద్దరూ తారస పడటం .. వాళ్లిద్దరి మధ్య పరిచయం పెరగడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ చాలా సరదాగా .. సందడిగా సాగిపోతుంది. ఇక ఇరువురి కుటుంబాలకు ఈ విషయం తెలియడం, అబ్బాయితో పాటు ఆమెను కూడా తమ ఇంటికి తీసుకుని వెళ్లడం .. తాము చెప్పిన అబద్ధాన్ని నిజం చేయలేక హీరో – హీరోయిన్ నానా తిప్పలు పడటం వంటి మలుపులతో సెకండాఫ్ నడుస్తుంది.పెళ్లి విషయంలో తనకంటూ ఒక అభిప్రాయం ఉన్న హీరో పట్నానికి రావడం, ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక అదే పట్నానికి హీరోయిన్ రావడం .. ఇద్దరి మధ్య పరిచయం చాలా సినిమాలలో ఆల్రెడీ చూసేసిన ఒక రొటీన్ ట్రాక్. హీరోయిన్ డబ్బు కోసం ఒక దగ్గర కేర్ టేకర్ గా చేరడం .. ఆ ఫ్యామిలీ ద్వారా లండన్ వెళ్లే ఆలోచన చేయడం .. తనకి ఆమె దూరమైపోతుందేమోనని హీరో మానసిక సంఘర్షణకి లోను కావడం కూడా మామూలే. ఇక ఈ కథలో కాస్త గందర గోళం ఏర్పడటానికి కారణం హీరో ఆడిన ఒక అబద్ధం. ఆ అబద్ధం హీరో చెప్పడం కూడా అంత అవసరమని ఆడియన్స్ కి అనిపించదు. ఈ అబద్ధమే దాదాపు అన్ని పాత్రలను అయోమయంలో పడేసి, అందుకు సంబంధించిన హడావిడితోనే ప్రీ క్లైమాక్స్ కి తీసుకుని వెళ్లి .. అక్కడి నుంచి క్లైమాక్స్ ను చూపిస్తుంది. క్లైమాక్స్ దగ్గరికి వచ్చేసరికి మళ్లీ రొటీన్ బాటనే పట్టడం కనిపిస్తుంది. చాలా కథలు నడిచిన ఫార్మాట్ లోనే ఈ కథ కూడా వెళుతుంది. అతకని అబద్ధం తప్ప ఎక్కడా కొత్తదనం కనిపించదు. కాకపోతే ట్రీట్మెంట్ కారణంగా, రాధిక .. భాగ్యరాజ్ .. ప్రభు .. సుహాసిని వంటి బలమైన తారాగణం కారణంగా బోర్ అనిపించదు. ప్రధానమైన పాత్రలను పోషించిన నటీనటులంతా సీనియర్స్ కావడం వలన, ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. రాజేశ్ శుక్లా ఫొటోగ్రఫీ .. జీన్ మార్టిన్ సంగీతం .. ఫిలోమిన్ రాజ్ ఎడిటింగ్ ఫరవాలేదు. ఒకరిని ఇష్టపడటం చాలా తేలిక. అయితే ఆ వ్యక్తి చేత తిరిగి ప్రేమించబడటం చాలా కష్టం. నిజమైన ప్రేమను పొందాలంటే నిరీక్షణ తప్పదు అనే ఒక సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది.

# 'అతడు' రోజులొచ్చేశాయ్

## – యంగ్ లుక్‌లో మహేశ్.. ఫ్యాన్స్ ఫిదా!



సూపర్ స్టార్ మహేశ్ బాబు తన సరికొత్త లుక్‌తో ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తున్నారు. కొన్నేళ్లుగా గడ్డంతో రఫ్ లుక్‌లో కనిపించిన ఆయన, తాజాగా పూర్తిగా క్లీన్ షేవ్ చేసి మునుపటి కంటే యంగ్‌గా కనిపించడంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' షూటింగ్‌లో భాగంగా కాశీ షెడ్యూల్ పూర్తి చేసుకున్న మహేశ్, తాజాగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రత్యక్షమయ్యారు. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఎయిర్‌పోర్టులో ఎంతో ఉల్లాసంగా కనిపించిన మహేశ్, తనను ఫొటోలు తీస్తున్న కెమెరాలను చూసి నవ్వుతూ తన గడ్డం వైపు చూపిస్తూ 'గడ్డం లేదు' అన్నట్లుగా చిలిపి సైగలు చేశారు. ఈ దృశ్యాలు చూసిన ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. 51 ఏళ్ల వయసులో కూడా 24 ఏళ్ల కాలేజీ కుర్రాడిలా వెలిగిపోతున్నారంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. చాలా కాలం తర్వాత మహేశ్‌ను ఇలా క్లీన్ షేవ్‌లో చూడటంతో 'అతడు', 'ఒక్కడు' సినిమాల నాటి లుక్ గుర్తొస్తోందని, ఆ రోజులు మళ్లీ వచ్చేశాయని సంబరపడుతున్నారు.అయితే, మహేశ్‌లో ఈ ఆకస్మిక మార్పు వెనుక బలమైన కారణమే ఉందనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాజమౌళి సినిమా కోసం మహేశ్ గత రెండేళ్లుగా తన శరీరాకృతిని మార్చుకోవడంతో పాటు గడ్డంతో కూడిన రఫ్ గెటప్‌ను కొనసాగిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన రుద్ర అనే ట్రావెలర్‌గా, శ్రీరాముడిగా విభిన్న కోణాల్లో కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం సినిమాలో దాదాపు 15 నిమిషాల పాటు సాగే ఒక కీలక ఎపిసోడ్‌లో మహేశ్ 24 ఏళ్ల యువకుడిగా కనిపించనున్నారట.ఈ యువకుడి పాత్ర చిత్రీకరణ కోసమే మహేశ్ బాబు క్లీన్ షేవ్ చేసుకున్నారా? లేక కాశీ షెడ్యూల్ ముగియడంతో కాస్త రిలాక్స్ అయ్యేందుకు ఈ లుక్‌లోకి మారారా? అన్నది ఇప్పుడు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.కారణం ఏదైనా మహేశ్ 'ఏజ్‌లెస్ హ్యాండ్‌సమ్' లుక్ అభిమానులకు పండగలా మారింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు రహస్యం తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడాల్సిందే.

## ది ప్యారడైజ్ నుంచి 7 నిమిషాల సీన్లు కట్..

# అసలు విషయం బయటపెట్టిన నటుడు




నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, విభిన్నమైన కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే.. సినిమా నిడివిని తగ్గించే క్రమంలో పలు సన్నివేశాలను ఎడిటింగ్ సమయంలో తొలగించినట్లు తాజాగా వెల్లడైంది. ఈ విషయాన్ని సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు రెమో రహీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'ది ప్యారడైజ్' నిడివి దాదాపు మూడు గంటల వరకు ఉంటుంది. అయితే మొదట సినిమా మరింత ఎక్కువ నిడివితో ఉన్నట్లు తెలుస్తోంది. కథకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించినప్పటికీ, థియేటర్లలో సినిమాను ప్రేక్షకులు ఎక్కువసేపు చూడకుండా నిడివిని నియంత్రించాలనే ఉద్దేశంతో ఎడిటింగ్ సమయంలో కొన్ని భాగాలను తొలగించినట్లు సమాచారం. ఈ క్రమంలో తనకు సంబంధించిన సన్నివేశాలు కూడా సినిమాలో లేకుండా పోయాయని రెమో రహీమ్ తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆయన.. తన పాత్రకు సంబంధించిన సుమారు ఏడు నిమిషాల సన్నివేశాలను తొలగించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా సినిమాలోని రెండో ఫైట్‌కు సంబంధించిన భాగంలో తన సన్నివేశాలు ఉన్నాయని, అయితే సినిమా నిడివిని తగ్గించే ప్రక్రియలో ఆ సన్నివేశాలను కట్ చేశారని ఆయన పేర్కొన్నారు. తన సన్నివేశాలు తొలగించడంపై రెమో రహీమ్ కొంత నిరాశ వ్యక్తం చేసినప్పటికీ.. సినిమా నిడివిని నియంత్రించడం కూడా ముఖ్యమేనని అంగీకరించారు.ఒక నటుడిగా తాను ఎంతో ఆసక్తితో చేసిన సన్నివేశాలు చివరికి తెరపై కనిపించకపోవడం బాధ కలిగించే విషయమే అయినప్పటికీ, సినిమా మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు, ఎడిటింగ్ బృందం తీసుకున్న నిర్ణయాన్ని అర్థం చేసుకున్నట్లు ఆయన చెప్పినట్లుగా తెలుస్తోంది. అంతేకాదు.. 'ది ప్యారడైజ్'పై వస్తున్న ప్రతికూల ప్రచారాన్ని చూసి ముందుగానే ఒక అభిప్రాయానికి రావద్దని కూడా రెమో రహీమ్ ప్రేక్షకులను కోరారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివ్ టాక్ లేదా ఇతరుల అభిప్రాయాల ఆధారంగా సినిమాను అంచనా వేయకుండా.. ప్రేక్షకులు స్వయంగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూసి తమ అభిప్రాయాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. ఇక బాక్సాఫీస్ పరంగా చూస్తే 'ది ప్యారడైజ్'కు తొలి రోజు మంచి స్పందన లభించినట్లు చిత్ర వర్గాల నుంచి సమాచారం వస్తోంది. రెండో రోజు కూడా థియేటర్లలో ఆక్యుపెన్సీ ప్రోత్సాహకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా ఫలితంపై ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వస్తున్నప్పటికీ, ప్రారంభ వసూళ్ల విషయంలో మాత్రం నాని చిత్రానికి చెప్పుకోదగ్గ స్థాయి ప్రారంభం లభించినట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# నిరీక్షణకు తగిన ఫలితం



అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సైన్స్‌ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'రాకా' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పురాణ, వేద, వర్తమాన.. ఇలా భిన్న కాలాల నేపథ్యంలో సాగే కథాంశమిదని, సమాంతర ప్రపంచాలు అనే కాన్సెప్ట్ కూడా ఉంటుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఈ సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్స్ ఏమీ రాలేదు. ఈ విషయంలో అభిమానులు కాస్త అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ స్పందించారు. ఫ్యాన్స్ కాస్త ఓపిక పట్టాలని, అత్యుత్తమ చిత్రాన్ని అందించేందుకు తాము శ్రమిస్తున్నామని చెప్పారు. 'మీ నిరీక్షణకు తగిన ఫలితం తప్పకుండా ఉంటుంది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. సినిమా కోసం టీమ్ చేస్తున్న కృషి నాకు గర్వంగా ఉంది' అని అల్లు అర్జున్ పేర్కొన్నారు. అట్లీ దర్శకత్వంలో సన్‌పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకురానుంది.

# దేశంలోనే సంపన్న నటుడు



బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్ దేశంలోనే అత్యంత ధనిక నటుడిగా నిలిచారు. గత ఏడాదితో పోల్చితే ఆయన సంపద దాదాపు 2,490కోట్లు తగ్గినప్పటికీ..సంపన్న నటుడిగా ఆయన స్థానంలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. హురున్ ఇండియా రిచ్‌లిస్ట్ ప్రకారం షారుఖ్‌ఖాన్ ప్రస్తుత సంపద 10వేల కోట్లుగా అంచనా వేశారు. సినిమాలతో పాటు వివిధ వ్యాపారాల్లో పెట్టుబడుల ద్వారా షారుఖ్‌కాన్ భారీ మొత్తంలో ఆర్జిస్తున్నట్లు హురున్ ఇండియా సంస్థ పేర్కొంది. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సినీ నిర్మాణంతో పాటు ఐపీఎల్ ఫ్రాంఛైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ ద్వారా వస్తున్న లాభాలు ఆయన ఆర్థిక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. షారుఖ్‌ఖాన్ తర్వాత అమితాబ్ బచ్చన్ 4వేల కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు.

# భావోద్వేగాల సమ్మేళనంగా సిగ్మా



'ఇందులో రేడియో జాకీలా కనిపిస్తా. మంచి ఎమోషనల్ క్యారెక్టర్ నాది. అన్ని రకాల ఎమోషన్స్‌నీ ఇందులో ప్రజెంట్ చేశాను. మంచి యాక్షన్ అడ్వెంచర్ కామెడీ సినిమా ఇది. ఫ్యామిలీతో కలిసి హాయిగా చూడొచ్చు' అని ఫరియా అబ్దుల్లా అన్నారు. సందీప్‌కిషన్ కథానాయకుడిగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా కథానాయిక. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈచిత్రం అక్టోబర్ 2న విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఫరియా అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. 'సందీప్‌కిషన్, నేనూ కలిసి ఎప్పట్నుంచో ఓ సినిమా చేయాలనుకుంటున్నాం.

ఫైనల్‌గా సిగ్మాతో కుదిరింది. జూమ్ కాల్‌లో జేసన్ ఈ కథ చెప్పారు. కథ విన్న తర్వాత ఆయన్ను 'వయసెంత?' అనడిగాను. 24ఏళ్లని చెప్పారు. నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. ఒక సూపర్‌స్టార్ కొడుకు అనే ఫీలింగ్ ఆయనలో మచ్చుకైనా కనిపించదు. వినయంగా, ఫ్రెండ్లీగా ఉంటారు. తొలి సినిమా అయినప్పటికీ ఎంతో క్లారిటీగా, విజన్‌తో సినిమా తీశారు' అని తెలిపింది ఫరియా అబ్దుల్లా. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళంలో ఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉందని, తమన్ బీజీఎం, పాటలు నెక్స్ట్ లెవెల్లో ఉంటాయని ఫరియా పేర్కొన్నది.

# ఎయిర్‌ఫోర్స్ నేపథ్య ప్రేమకథ



సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్‌బీర్‌కపూర్, అలియాభట్, విక్కీకౌశల్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. నిర్మాణ దశలోనే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రణబీర్‌కపూర్ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ఆయన చేతికి గాయంతో రక్తమోడుతూ కనిపిస్తున్నారు. ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్స్ బ్యాక్‌డ్రాప్‌లో ముక్కోణపు ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. 'గంగూభాయ్ కతియావాడి' తర్వాత సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం

**- అంగరంగ వైభవంగా వీడ్కోలు పలికిన ఆర్‌టీసీ కాలనీ నిఖిల్ రెడ్డి ఫ్రెండ్స్ బృందం**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడికి ఆర్‌టీసీ కాలనీ రోడ్డు నంబర్ 8లో ఘనంగా వీడ్కోలు పలికారు. నిఖిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ బృందం నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమం భక్తి, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలు, భజనలు, కార్యక్రమాలతో గణనాథుడిని కొలిచిన భక్తులు.. నిమజ్జన వేళ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, నృత్యాలు, జై గణేశ్ నినాదాలతో కాలనీ పరిసరాలు మార్మోగాయి. మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ భక్తులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది గణనాథుడి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గణనాథుడి ఆశీస్సులతో కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. యువత ఐక్యతతో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన గణేష్ నవరాత్రి ఉత్సవాలు.. అదే భక్తి భావంతో గణనాథుడి నిమజ్జనంతో ముగిశాయి.

## అనాథ వృద్ధులకు ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి - లీగల్ అవేర్నెస్ - సబ్ జడ్జి సరిత




**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** శ్రీ గాయత్రి విశ్వకర్మ అనాథ వృద్ధుల ఆశ్రమం టి ఆర్ నగర్ లో సబ్ జడ్జి సరిత, వృద్ధుల ఆరోగ్యం గురించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. లీగల్ అవేర్నెస్ గురించి చెప్పడం జరిగింది. అనంతరం వృద్ధులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వేల్ ఫేర్ ఆఫీసర్ భాస్కర్, ఆశ్రమ నిర్వాహకులు అధ్యక్ష కార్యదర్శి టి వి సూర్యం , నాగ భూషణం, స్టాఫ్ పాల్గొన్నారు.

## మియాపూర్‌లో ఘనంగా వినాయక చవితి ముగింపు వేడుకలు

**- అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్**



శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్) మియాపూర్ దత్త సాయి కాలనీ, నడిగడ్డ తండా, ఆరోబిందో కాలనీలలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ వి. జగదీశ్వర్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ పాల్గొని వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా ఉత్సవ కమిటీలు నాయకులను శాలువాలతో సత్కరించాయి. మహిళలు, యువత, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం కలగాలని నాయకులు ఆకాంక్షించారు.

## పవిత్రాలతో అమ్మవారికి అలంకారం

**- తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వైభవంగా పవిత్ర సమర్పణ**



తిరుచానూరు(ప్రశ్న న్యూస్) తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి పవిత్రాలను సమర్పించారు. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపిన అనంతరం సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పవిత్ర సమర్పణ జరిగింది. అమ్మవారి మూలమూర్తి, ఉత్సవమూర్తులు, ఉప ఆలయాలు, పరివార దేవతలు, విమాన ప్రాకారం, ధ్వజస్తంభానికి పవిత్రాలను సమర్పించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించే వైదిక కార్యక్రమాలు సాయంత్రం కూడా కొనసాగనున్నాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో శ్రీహరిరావు, సూపరింటెండెంట్లు సురేష్, రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, లక్ష్మీకాంతం, ఇతర అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నిరీక్షణలోనే ఆధ్యాత్మిక అనుభూతి

**- క్యూకాంప్లెక్స్‌లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్, త్వరలో భక్తులకు ఎస్వీ మ్యూజియం**

**- టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి**



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉండే సమయాన్ని ఆధ్యాత్మిక అనుభూతిగా, జ్ఞానాన్ని పెంపొందించే సమయంగా మార్చేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లోని 17వ కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన హీలింగ్ అండ్ డివోషనల్ సెంటర్ (పిల్గ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్) ద్వారా భక్తులకు తిరుమల చరిత్ర, శ్రీవారి వైభవం, పురాణాలు, ఆలయ విశిష్టతలను పరిచయం చేయనున్నారు. ఇదే సమయంలో నూతనంగా ఆధునీకరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియంను త్వరలో భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్యచౌదరి తెలిపారు.

### 3డీ, వీఆర్‌తో శ్రీవారి వైభవం

శుక్రవారం తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంను మీడియా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో అదనపు ఈవో మీడియా ప్రతినిధులతో సమావేశమై ప్రాజెక్టులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 16న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించిన పలు అభివృద్ధి ప్రాజెక్టుల్లో పిల్గ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా ఉందన్నారు. క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉండే భక్తులకు 3డీ, వర్చువల్ రియాలిటీ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో శ్రీవారి వైభవాన్ని పరిచయం చేయనున్నట్లు తెలిపారు. దర్శనం కోసం వేచి ఉండే సమయం కేవలం నిరీక్షణగా కాకుండా.. ఆధ్యాత్మికతను పెంపొందించుకునే, జ్ఞానాన్ని పొందే సమయంగా మార్చడమే లక్ష్యమని వివరించారు.

### కొత్త కంటెంట్.. నిరంతర ప్రసారం

స్వామివారికి సంబంధించిన కథలు, భక్తుల అనుభవాలు, తిరుమల కొండ విశిష్టతలు, ఆలయ చరిత్ర, నిర్మాణం, పరిపాలన, సేవలు, పురాణాలు, దాతల సేవలు తదితర అంశాలపై నాణ్యమైన కంటెంట్‌ను రూపొందించి ఎప్పటికప్పుడు ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో నిరంతరం కొత్త కంటెంట్ అందుబాటులో ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే దుర్లభ్ దర్శన్ సంస్థ ఆధ్వర్యంలో వర్చువల్ రియాలిటీ కంటెంట్ రూపొందించినట్లు తెలిపారు.

### 14 గ్యాలరీలతో ఎస్వీ మ్యూజియం

తిరుమలలో మరో ప్రధాన ఆకర్షణగా ఆధునీకరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియం నిలవనుంది. డిజిటల్ కంటెంట్‌తో పాటు తిరుమల ఆలయ చరిత్ర, వారసత్వం, పురాతన కళాఖండాలు, చారిత్రక వస్తువులను ప్రదర్శించేలా మ్యూజియంను తీర్చిదిద్దారు. దాదాపు 14 గ్యాలరీల్లో ప్రత్యేక థీమ్‌లతో మ్యూజియాన్ని రూపొందించినట్లు వెంకయ్యచౌదరి తెలిపారు. ఆలయ సంప్రదాయం, వారసత్వానికి అనుగుణంగా గ్యాలరీలను తీర్చిదిద్దినట్లు చెప్పారు. మ్యూజియం నిర్వహణకు ప్రత్యేక మాన్యువల్‌ను రూపొందిస్తున్నామని, సీసీ కెమెరాలు, సిబ్బంది నియామకం, గైడ్ల సేవలు, భద్రత, కళాఖండాలకు ప్రత్యేక నంబరింగ్ తదితర అంశాలను అందులో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఓపీ ప్రకారం నిర్వహణ చేపట్టి త్వరలో భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

### మీడియా సూచనలకు ప్రాధాన్యం

ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఎస్వీ మ్యూజియంలను పరిశీలించిన మీడియా ప్రతినిధులు పలు సూచనలు చేశారని అదనపు ఈవో తెలిపారు. ముఖ్యంగా తెలుగు కంటెంట్‌ను మరింత పెంచడం, కంటెంట్‌ను తరచూ మార్చడం, విభిన్న అంశాలను అందుబాటులోకి తీసుకురావడం వంటి సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. తిరుమల యాత్ర కేవలం దర్శనానికే పరిమితం కాకుండా చరిత్ర, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతపై అవగాహన కలిగించేలా ఉండాలన్నదే టీటీడీ ఉద్దేశమని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, సీపీఆర్వో డాక్టర్ టి.రవి, విజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనసేనలోకి వైసీపీ నేతలు

**- పవన్ సమక్షంలో యనమల కృష్ణుడు, నవీన్ నిశ్చల్ సహా పలువురి చేరిక**

**- స్థానిక ఎన్నికల వేళ ఊపందుకున్న చేరికలు**

**- క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై జనసేన దృష్టి**



**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి పెరుగుతున్న వేళ.. జనసేనలోకి ఇతర పార్టీలకు చెందిన నేతల చేరికలు కొనసాగుతున్నాయి. తుని నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకుడు యనమల కృష్ణుడు, హిందూపురం సీనియర్ వైసీపీ నాయకుడు నవీన్ నిశ్చల్ సహా పలువురు నాయకులు శుక్రవారం జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆయా నాయకులకు పవన్ కల్యాణ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ నుంచి కీలక నేతలు జనసేనలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ముఖ్యంగా తుని వంటి రాజకీయంగా కీలకమైన నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు జనసేనలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన జనసేనలో చేరనున్నారంటూ గత కొద్దిరోజులుగా తుని రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగింది. సెప్టెంబరు 23న కూడా ఆయన చేరికపై వార్తలు వెలువడ్డాయి.

### స్థానిక పోరుకు ముందే కదలికలు

రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో తమ బలాబలాలను అంచనా వేసుకుంటున్నాయి. జనసేన కూడా గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ఆగస్టులోనే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన పార్టీ.. తాజాగా ప్రచార నిర్వహణకు కూడా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఇతర పార్టీలకు చెందిన స్థానికంగా ప్రభావం ఉన్న నాయకుల చేరికలు జనసేనకు సంస్థాగతంగా ప్రాధాన్య అంశంగా మారుతున్నాయి. అయితే ఒక నాయకుడి చేరికతోనే ఏ ప్రాంతంలోనైనా ఎన్నికల ఫలితాలు మారిపోతాయని చెప్పడానికి వీలులేదు. స్థానికంగా అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం, స్థానిక సమస్యలు, నాయకత్వ బలం వంటి అనేక అంశాలు ప్రభావం చూపనున్నాయి. ప్రస్తుతానికి జనసేన మాత్రం వరుస చేరికలతో సంస్థాగతంగా విస్తరించే ప్రయత్నాన్ని కొనసాగిస్తోంది.

# కొమ్మూరులో 'మూడు మహనీయులు'

**- ఎన్టీఆర్, అంబేడ్కర్, అబ్దుల్ కలాం విగ్రహాల ఆవిష్కరణ:పెమ్మసాని**



**కాకుమాను(ప్రశ్న న్యూస్)** మహనీయుల ఆలోచనలను భావితరాలకు చాటిచెప్పేలా కాకుమాను మండలం కొమ్మూరు గ్రామంలో ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కాకుమాను మండల టీడీపీ నాయకులు అగస్టీన్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక బస్‌స్టాప్‌ను కూడా ప్రారంభించారు. విగ్రహావిష్కరణ అనంతరం ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బాష్యం రామకృష్ణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్పొరేషన్ చైర్‌పర్సన్ వందనా దేవి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

### 'కొత్త ఆలోచన.. కొత్త కాన్సెప్ట్'

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కొమ్మూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు వినూత్నంగా ఉన్నాయన్నారు. విగ్రహాల కింద గ్రంథాలయం ఏర్పాటు చేయడం కొత్త కాన్సెప్ట్ అని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో ఇలాంటి ఆలోచనతో ఏర్పాటు చేసిన విగ్రహాలు అరుదుగా కనిపిస్తాయని తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు అగస్టీన్‌బాబుకు తొలుత ఆర్థిక వనరులు లేకపోయినా పట్టుదలతో ముందుకు సాగారని మంత్రి పేర్కొన్నారు. ఒక నాయకుడికి ఉండాల్సిన సంకల్పానికి ఇది ఉదాహరణగా నిలుస్తుందన్నారు. కొమ్మూరు గ్రామ ప్రజల ఐక్యతను మంత్రి ప్రస్తావించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసి జీవిస్తున్నారని, స్వయం ఉపాధిని నమ్ముకుని జీవిస్తున్న మహిళలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు కలిసిమెలిసి ఉండటం గ్రామ స్వరాజ్యానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నక్కల శైలజ, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, గింజపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు వీరయ్య చౌదరి, నియోజకవర్గ జనసేన కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పరుగుల బరిలో పతకాల పంట

**- మహిళా కానిస్టేబుల్ విజయకు హోంమంత్రి అనిత సత్కారం**

**- పోలీసులతో కలిసి టిఫిన్.. విధులు, క్రీడలపై ముచ్చట**



**నక్కపల్లి(ప్రశ్న న్యూస్)** విధి నిర్వహణలో పోలీసు.. క్రీడా ప్రాంగణంలో క్రీడాకారిణి.. పరుగుల బరిలో పతకాల వేటలో దూసుకెళ్తున్నారు పాయకరావుపేట పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ వి.విజయ. పోలీసు విధులను సమర్థంగా నిర్వహిస్తూనే క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో విజయ సత్తా చాటారు. మొత్తం ఆరు విభాగాల్లో పాల్గొని స్వర్ణ పతకాలు సాధించారు. 5 వేల మీటర్లు, 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగుతోపాటు 400ఐ4 మీటర్ల రిలేలోనూ ప్రథమస్థానంలో నిలిచి పతకాలు కైవసం చేసుకున్నారు. ఖోఖో, కబడ్డీ పోటీల్లోనూ విజయ ప్రాతినిధ్యం వహించిన జట్లు ప్రథమస్థానంలో నిలిచాయి. దీంతో ఆయా విభాగాల్లోనూ ఆమెకు బంగారు పతకాలు దక్కాయి.

### పోలీసులతో కలిసి టిఫిన్

క్రీడల్లో విజయ సాధించిన మహిళా కానిస్టేబుల్ విజయను హోంమంత్రి వంగలపూడి అనిత అభినందించారు. నక్కపల్లి మండలంలోని విజయ నివాసం వద్ద ఆమెతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్‌తో వివిధ అంశాలపై మంత్రి ముచ్చటించారు. విధి నిర్వహణ, క్రీడల్లో సాధిస్తున్న విజయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం విజయను ఘనంగా సత్కరించి అభినందించారు. క్రీడా పోటీల్లో సాధించిన పతకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అనిత ప్రశంసించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### కానిస్టేబుల్ రాంబాబుకు సన్మానం

పాయకరావుపేట పోలీస్ పరిధిలో పలు కేసుల దర్యాప్తులో కీలకపాత్ర పోషిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న కానిస్టేబుల్ రాంబాబును కూడా హోంమంత్రి అనిత సత్కరించారు.

### అవయవదానంపై ప్రశంస

అవయవదానం చేసిన నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావును హోంమంత్రి అభినందించారు. సమాజానికి ఆదర్శంగా నిలిచేలా అవయవదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

# రైతు ధాన్యానికి 24 గంటల్లో నగదు

**- సొంత వాహనాలతో తరలించినా రవాణా ఛార్జీలు వెంటనే**

**- ఖరీఫ్‌లో 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం.. 2,619 కేంద్రాలు**

**- గన్నీ బ్యాగులు కొరత వస్తే ప్రత్యామ్నాయాలు.. మంత్రి నాదెండ్ల మనోహర్**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఖరీఫ్ ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సొంత వాహనాల్లో కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఖరీఫ్‌లో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ సన్నద్ధతపై శుక్రవారం విజయవాడలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం దిగుబడి అంచనాలను సవరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తొలుత ఎల్‌నినో ప్రభావంతో 1.10 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామని, ప్రస్తుతం వర్షాలు అనుకూలంగా ఉండటంతో ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

### సంపూర్ణ రైతు ప్రభుత్వం..

ధాన్యం సేకరణలో ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. గత ఖరీఫ్‌లో సుమారు రూ.12 వేల కోట్ల ధాన్యం సేకరణ మొత్తాన్ని రైతులకు 24 గంటల్లోపే చెల్లించామని చెప్పారు. అదే స్ఫూర్తితో ఈ ఖరీఫ్ సేకరణను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. "మాది సంపూర్ణ రైతు ప్రభుత్వం. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లను కూడా పెంచుతాం" అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# జవహర్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాలు స్వాహా.?

- సర్వే నంబర్ 500లో ప్రభుత్వ భూమి కబ్జా అంటూ స్థానికుల ఆరోపణలు
- "ప్లాట్లు కొట్టు.. ప్రభుత్వ స్థలం అమ్మిపెట్టు" అంటూ తీవ్ర విమర్శలు
- కాప్రా రెవెన్యూ అధికారుల మౌనం ఎందుకు.?
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని స్థానికుల డిమాండ్





**జవహర్‌నగర్ (ప్రశ్న న్యూస్)** జవహర్‌నగర్ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యంగా సర్వే నంబర్ 500లోని ప్రభుత్వ స్థలంపై కబ్జా జరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం.. ప్రభుత్వ స్థలాలను గుర్తించి హద్దులు నిర్ణయించి, రికార్డులను రక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతోందని కొంతమంది రాజకీయ నాయకులు పార్టీలను అడ్డం పెట్టుకొని కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాలను చిన్నచిన్న ప్లాట్లుగా విభజించి లక్షలలో అమ్ముతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో "ప్లాట్లు కొట్టు.. ప్రభుత్వ స్థలం అమ్మిపెట్టు" అనే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు.

### రెవిన్యూ అధికారుల కనుసైగల్లోనేనా.?

కాప్రా రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములపై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదులు అందితే స్థల పరిశీలన, సర్వే, రికార్డుల పరిశీలన, హద్దుల నిర్ధారణ వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే జవహర్‌నగర్‌లో జరుగుతున్నట్లు చెబుతున్న ఆక్రమణలపై రెవెన్యూ సిబ్బంది అధికారుల స్పష్టమైన చర్యలు అసలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం జరిగితే భవిష్యత్తులో ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన భూములు శాశ్వతంగా ప్రైవేటు చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఇలా జవహర్ నగర్ పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ స్థలాలు కబ్జా జరిగి కొంతమంది స్థానికులు వందల కోట్లు అక్రమంగా సంపాదించారని ఇందులో కాప్రా రెవిన్యూ అధికారుల భాగస్వామ్యం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

సర్వే నంబర్ 500తో పాటు జవహర్‌నగర్ పరిధిలోని ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వ రికార్డులతో క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణలు నిజమైతే వాటిని వెంటనే తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి జవహర్‌నగర్ ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణకు ఆదేశిస్తారా.? లేక అంతర్గత ఒప్పందాలతో ప్రభుత్వ స్థలాలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నా రెవెన్యూ యంత్రాంగం మౌనంగానే ఉంటుందా.? అనేది వేచి చూడాలి. అధికారుల స్పందన: ఈ ఆరోపణలపై కాప్రా రెవెన్యూ అధికారులు, ఉన్నతాధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

# 1980ల జ్ఞాపకాలకు (ఏఐ)రెక్కలు

## - ఒక్క ఫొటోతో పాత కాలంలోకి.. సోషల్ మీడియాలో 'రెట్రో' రచ్చ




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** 1980ల కాలం... అప్పటి ఫ్యాషన్, హెయిర్‌స్టైల్, ఫొటోగ్రఫీ, వింటేజ్ లుక్ ఇప్పుడు మళ్లీ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. అయితే ఈసారి పాత ఫొటోలు బయటకు తీయడం కాదు.. కృత్రిమ మేధ (ఏఐ)తో నేటి ఫొటోలకు 80ల రూపాన్ని అద్దుతున్నారు.

ఒక్క ఫొటోను (ఏఐ)టూల్‌లోకి తీసుకెళ్లి కొన్ని సూచనలు ఇస్తే చాలు.. హెయిర్‌స్టైల్ నుంచి దుస్తులు, బ్యాక్‌గ్రౌండ్, కెమెరా ఎఫెక్ట్ వరకు 1980ల నాటి వాతావరణాన్ని పోలిన కొత్త చిత్రాన్ని రూపొందిస్తోంది. దీంతో యువత నుంచి సెలబ్రిటీల వరకు ఈ రెట్రో ట్రెండ్‌పై ఆసక్తి చూపుతున్నారు.

### ప్రముఖులూ 80ల' బాటలో..

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ట్రెండ్‌లో పలువురు రాజకీయ నాయకులు కూడా తమ రెట్రో లుక్‌లను పంచుకున్నారు. పీయూష్ గోయల్, కిరెన్ రిజిజు, హిమంత బిశ్వ శర్మ తదితరులు 80ల శైలిలో రూపొందించిన చిత్రాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కొందరు మాత్రం (ఏ ఐ) చిత్రాల బదులు తమ అసలు 1980ల నాటి ఫొటోలను పంచుకున్నారు.

### నోస్టాల్జియా.. కొత్త టెక్నాలజీ కలయిక

80ల కాలాన్ని ప్రత్యక్షంగా చూడని నేటి తరం కూడా ఆ కాలపు ఫ్యాషన్, సంగీతం, ఫొటోగ్రఫీ స్టైల్‌పై ఆసక్తి చూపడం ఈ ట్రెండ్ ప్రత్యేకతగా మారింది. అయి (ఏ ఐ )ద్వారా ఊహించిన గతాన్ని కళ్లముందు చూసుకునే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో ఈ కంటెంట్‌కు విపరీతమైన



స్పందన కనిపిస్తోంది.

### అయితే జాగ్రత్త తప్పనిసరి

అయి (ఏ ఐ )తో ఫొటోలు తయారు చేయడం వినోదంగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత ఫొటోలను తెలియని వెబ్‌సైట్లు లేదా అనుమానాస్పద యాప్‌లలో అప్‌లోడ్ చేయడంపై జాగ్రత్త అవసరం. 80ల రెట్రో ఫొటోల పేరుతో నకిలీ లింకులు, మోసపూరిత ఫైళ్ల ద్వారా వ్యక్తిగత డేటాను దొంగిలించే ప్రయత్నాలపై సైబర్ భద్రతా హెచ్చరికలు కూడా వెలువడ్డాయి.

# నాచారం సమస్యల నిలయం

- మరమ్మతుల పేరుతో రోడ్డును బొందగా వదిలేశారు.. వర్షం పడితే జలమయమే - మహంకాళి దేవాలయం వెనుక దారుణ దుస్థితి
- ఫ్లెక్సీల పోటీలో నేతలు బిజీ, ప్రజా సమస్యలపై మాత్రం నిర్లక్ష్యం

**నాచారం(ప్రశ్న న్యూస్)** నగర అభివృద్ధి అంటే ఫ్లెక్సీలు, బ్యానర్లు, హంగామా కార్యక్రమాలేనా.? ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఎవరిది.? నాచారం ప్రాంతంలో నెలకొన్న దుస్థితిని చూస్తే ఈ ప్రశ్నలు తలెత్తక మానవు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడంలో పోటీ పడుతున్నప్పటికీ, ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యలపై మాత్రం అసలు పట్టించుకునే వారు కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.నాచారం మహంకాళి దేవాలయం వెనుక ప్రాంతంలో రహదారి పరిస్థితి దారుణంగా మారింది. మరమ్మతుల పేరుతో రోడ్డును తవ్వి, తిరిగి సక్రమంగా వేయకుండా బొందలు, గుంతలతో వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనే రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఈ రహదారి, వర్షం పడితే మరింత ప్రమాదకరంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో రోడ్డు ఎక్కడుంది, గుంత ఎక్కడుంది అనే పరిస్థితి నెలకొంటోంది. ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు, స్థానికంగా రాకపోకలు సాగించే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటిలో దాగి ఉన్న గుంతలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్నా నాచారం సర్కిల్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రజలు రోడ్డు దుస్థితితో అవస్థలు పడుతుంటే.. మరోవైపు మేము లీడర్లు అని చెప్పుకునే వాళ్ళు, రాజకీయ నాయకులు మాత్రం ఫ్లెక్సీలు, స్వాగత బ్యానర్లు, ప్రచార కార్యక్రమాల ఏర్పాటులో పోటీ పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల ఓట్లతో పదవులు, గుర్తింపు పొందుతున్న నాయకులు అదే ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు వెనుకంజ వేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లెక్సీలకు ఖర్చు చేసే సమయం, శ్రమలో కొంతైనా ప్రజా సమస్యల పరిష్కారానికి కేటాయిస్తే నాచారం రూపురేఖలు మారే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. చీటికిమాటికి సోషల్ మీడియాలో ప్రజలకు అందుబాటులో ఉంటా అని చెప్పుకొనే మాజీ కార్పొరేటర్ ఎక్కడ పోయారని, రోడ్డు మరమ్మతులను



తక్షణమే పూర్తి చేసి, వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా నాచారం సర్కిల్ అధికారులు, ఎమ్మెల్యే స్పందించి మహంకాళి దేవాలయం వెనుక రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా.? లేక ఫ్లెక్సీల వెలుగుల్లోనే ప్రజల సమస్యలు చీకటిలో మగ్గాల్సిందేనా.? అన్నది వేచి చూడాలి.

## రూ.2.10 కోట్ల లావాదేవీపై ఆరెకపూడి గాంధీ వివరణ



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** సాహితీ సంస్థ నుంచి రూ.2.10 కోట్లు అందినట్లు మీడియాలో జరుగుతున్న ప్రచారంపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వివరణ ఇచ్చారు. ఆ మొత్తం 2018లో కార్యాలయ స్థలం కోసం తాము సదరు సంస్థకు ఖాతా ద్వారా చెల్లించినదేనని తెలిపారు.కార్యాలయ స్థలం కేటాయింపు జరగకపోవడంతో సదరు సంస్థ ఆ మొత్తాన్ని తిరిగి తమ ఖాతాకు జమ చేసిందని పేర్కొన్నారు. ఈ లావాదేవీకి సంబంధించిన వాస్తవాలను మీడియా మిత్రులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు.సాహితీ సంస్థ కార్యకలాపాలతోగానీ, ఇతర వ్యవహారాలతోగానీ తమకు ఎలాంటి సంబంధం లేదని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని మీడియా ప్రతినిధులను కోరారు.

## ఉగ్రవాద దేశం నన్ను ప్రశ్నిస్తోందా

### - పాకిస్థాన్ జర్నలిస్టుకు జైశంకర్ దిమ్మతిరిగే కౌంటర్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఐక్యరాజ్యసమితి సమావేశం వేదికగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పాకిస్థాన్‌కు చెందిన ఓ జర్నలిస్టుకు ఘాటుగా సమాధానమిచ్చారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడు ఆపుతుందంటూ సదరు విలేకరి అడిగిన ప్రశ్నకు జైశంకర్ తీవ్రంగా స్పందించారు. "ఒక ఉగ్రవాద దేశం నన్ను ఈ ప్రశ్న అడుగుతోందా?" అంటూ ఆయన సూటిగా ఎదురు ప్రశ్నించారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు జైశంకర్ పైవిధంగా బదులిచ్చి, ఇతర భారత ప్రతినిధులతో కలిసి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఆ జర్నలిస్టు తన ప్రశ్నను పూర్తి చేసేలోపే భారత బృందం ఆ గదిని వీడింది.ఇటీవల కాలంలో ఉగ్రవాదం అంశంపై ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనుక పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల హస్తం ఉందని భారత్ ఆరోపించింది. దీనికి ప్రతిచర్యగా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ క్షిపణి దాడులు నిర్వహించింది. ఇదే సమయంలో, ఐరాస మానవ హక్కుల మండలిలో భారత దౌత్యవేత్త క్షితిజ్ త్యాగి సైతం పాకిస్థాన్ తీరును తీవ్రంగా విమర్శించారు. పరాయి దేశాల భూభాగాలను ఆశించడం, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడం వంటి చర్యలు మానుకుని, పాకిస్థాన్ తన సొంత ఆర్థిక సమస్యలు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జరుగుతున్న నిరసనల్లో పౌరుల మరణాలపై వస్తున్న నివేదికలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రవాదంపై ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న తీవ్ర దౌత్యపరమైన వైరుధ్యాలకు ఈ పరిణామాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## దేశంలో తగ్గుతున్న గ్యాస్ వాడకందార్ల సంఖ్య

### - ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య 62 లక్షల కనెక్షన్ల తగ్గుదల




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో గడిచిన దశాబ్ద కాలంలో తొలిసారిగా గృహ వినియోగ ఎల్పీజీ వినియోగదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మొదటి వారం మధ్య సుమారు 62 లక్షల యాక్టివ్ గ్యాస్ కనెక్షన్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 333.9 మిలియన్లుగా ఉన్న వినియోగదారుల సంఖ్య, సెప్టెంబర్ నాటికి 327.7 మిలియన్లకు పడిపోయింది. పేద కుటుంబాల కోసం ఉద్దేశించిన ఉజ్వల పథకం లబ్ధిదారులు కూడా 6 లక్షల మేర తగ్గడం గమనార్హం. ఈ తగ్గుదలకు ప్రధాన కారణం అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణమేనని తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ఎల్పీజీ దిగుమతులకు ఆటంకం కలిగింది. భారత్ తన గ్యాస్ అవసరాల్లో దాదాపు 90 శాతం గల్ఫ్ నుంచే దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, సరఫరా వ్యవస్థలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో చమురు మార్కెటింగ్ కంపెనీలు కొత్త గృహ వినియోగ ఎల్పీజీ కనెక్షన్ల జారీని నిలిపివేశాయి.అంతేకాకుండా, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్ ద్వారా అధికారులు తనిఖీలను కఠినతరం చేశారు. దీని ద్వారా వాడకంలో లేని కనెక్షన్లు, ఒకే కుటుంబంలో ఉన్న బహుళ కనెక్షన్లు, ఇప్పటికే పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వాడుతున్న ఇళ్లను గుర్తించి ఎల్పీజీ కనెక్షన్లను తొలగిస్తున్నారు. పీఎన్‌జీ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఆ కనెక్షన్లకు మారేలా ప్రభుత్వం ప్రోత్సహించడం కూడా ఈ తగ్గుదలకు మరో కారణం. ప్రాంతాల వారీగా పరిశీలిస్తే, అత్యధికంగా దక్షిణ భారతదేశంలో 26.3 లక్షల కనెక్షన్లు తగ్గాయి. ఆ తర్వాత పశ్చిమ, ఉత్తర భారత దేశాల్లోనూ ఈ ప్రభావం అధికంగా కనిపించింది. దశాబ్దాలుగా క్రమంగా పెరుగుతూ వచ్చిన ఎల్పీజీ వినియోగదారుల సంఖ్య ఇలా ఒక్కసారిగా తగ్గడం ఇదే మొదటిసారి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588